ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5 విశాఖపట్నం
జిల్లా వార్తలు
ఆదివారం 24 మార్చి 2024



పోలీస్ శాఖలో సీబీఐ గుబులు

- కంటెయినర్ తనిఖీ ప్రక్రియ స్థానిక అధికారుల జోక్యం వల్లే ఆలస్యమైందని సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ ప్రకటన
- ఇది ఎంతవరకు వెళుతుందోనని అధికారుల్లో ఆందోళన
- నివేదికలో ఏమని పొందుపరుస్తారనే దానిపై ఉత్కంఠ
- భవిష్యత్తులో పదోన్నతులపై ప్రభావం చూపే అవకాశం


కంటైనర్ టెర్మినల్

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

నగర పోలీస్ అధికారుల్లో కొంతమందికి ప్రస్తుతం సీబీఐ గుబులు పట్టుకుంది. బ్రెజిల్ నుంచి నౌక ద్వారా నగరానికి చేరిన కంటెయినర్‌లో 25 వేల కిలోల డ్రై ఈస్ట్‌ను కొకైన్ కలిసి ఉందనే సమాచారంతో సీబీఐ అధికారులు నాలుగు రోజుల క్రితం సీజ్ చేసిన విషయం తెలిసిందే. తాము 19నే కంటెయినర్‌లో వచ్చిన సరకును నార్కోటిక్ డిటెక్షన్ యంత్రాలతో పరీక్షించామని, కొకైన్ ఉన్నట్టు ప్రాథమికంగా నిపుణులు తేల్చారని సీబీఐ వెల్లడించింది. అయితే స్థానిక ప్రభుత్వ అధికారుల జోక్యం వల్ల విచారణ ఆలస్యమైందని ప్రస్తావించడం అనేక అనుమానాలకు దారితీసింది.

బ్రెజిల్ నుంచి విశాఖ పోర్టుకు బయలుదేరిన నౌకలో డ్రై ఈస్ట్‌తో కలిపి నార్కోటిక్ డ్రగ్స్‌ను రవాణా చేస్తున్నారంటూ ఇంటర్‌పోల్ అధికారులు ఢిల్లీలోని సీబీఐ అధికారులకు సమాచారం ఇచ్చారు. దాని ఆధారంగా ఢిల్లీ నుంచి సీబీఐ అధికారుల ప్రత్యేక బృందం విశాఖ చేరుకుంది. స్థానికంగా ఉన్న సీబీఐ అధికారులు కొందరితోపాటు కస్టమ్స్ అధికారులను సహాయంగా తీసుకున్నారు. ఈనెల 19న విశాఖ పోర్టు కంటెయినర్ టెర్మినల్‌కు చేరిన కంటెయినర్‌ను గుర్తించి, తనిఖీ చేశారు. కంటెయినర్‌లో ఉన్న డ్రై ఈస్ట్‌లో నార్కోటిక్ డ్రగ్స్ ఉందా? లేదా? అనేది గుర్తించేందుకు నగర పోలీస్ కమిషనరేట్‌లోని నార్కోటిక్ డాగ్ స్క్వాడ్‌ను పంపించాలంటూ నగర అధికారులను సీబీఐ అధికారులు కోరారు. ఆ మేరకు నార్కోటిక్ డ్రగ్ డిటెక్షన్‌లో సుశిక్షితమైన డాగ్ స్క్వాడ్‌తోపాటు హ్యాండ్లర్‌ను పంపిస్తే సరిపోతుంది. కానీ డాగ్ స్క్వాడ్‌తోపాటు కొంతమంది పోలీస్ అధికారులు కూడా కంటెయినర్ టెర్మినల్‌కు వెళ్లారు. వీరితోపాటు ఇతర శాఖలకు చెందిన మరికొందరు అధికారులు కూడా వెళ్లినట్టు ప్రచారం జరుగుతోంది. వీరంతా అవసరం లేకుండా అక్కడకు వెళ్లడంపై అనుమానాలు వ్యక్తమయ్యాయి. అక్కడతో ఆగకుండా తమకు కూడా డ్రై ఈస్ట్ శాంపిల్స్ ఇవ్వాలని కోరారని, అందుకు సీబీఐ అధికారులు అంగీకరించలేదని సమాచారం. దీంతో అధికార పార్టీకి చెందిన కొందరు నేతలు కంటెయినర్‌ను వదిలేయాలని సీబీఐ అధికారులపై ఒత్తిడి చేసినట్టు కూడా ప్రచారం జరుగుతోంది. ఇదిలావుండగా సీబీఐ అధికారులు జారీచేసిన ప్రెస్‌నోట్‌లో స్థానిక ప్రభుత్వ అధికారుల జోక్యం వల్ల విచారణ ఆలస్యమైందని పేర్కొనడం భవిష్యత్తులో తీవ్ర పరిణామాలకు దారితీయవచ్చునని పోలీస్ అధికారులు కొందరు పేర్కొంటున్నారు. అవసరం లేకపోయినా సీబీఐ అధికారులు తనిఖీ చేస్తున్న కంటెయినర్ వద్దకు వెళ్లడం, శాంపిల్స్ అడగడం, అక్కడి సమాచారాన్ని ఇతరులకు చేరవేయడం వాస్తవమైతే మాత్రం సీబీఐ అధికారులు తీవ్రంగా పరిగణిస్తారు. బాధ్యులైన వారిపై చర్యలకు రాష్ట్ర హోంశాఖతోపాటు కేంద్ర హోంశాఖకు కూడా సిఫారసు చేస్తారని పోలీస్ అధికారులు పేర్కొంటున్నారు. భవిష్యత్తులో పదోన్నతులు, ఇతర ప్రయోజనాలకు కూడా అవరోధంగా మారుతుందంటున్నారు.

సినీ నటి సౌమ్యశెట్టి కేసుపై రగడ



- తనను అన్యాయంగా ఇరికించారంటూ సోషల్ మీడియాలో సౌమ్యశెట్టి పోస్టులు
- యూట్యూబ్ ఛానెళ్లకు ఇంటర్వ్యూలు
- ఆ బంగారం తన స్నేహితురాలు మౌనికే తనకు ఇచ్చిందంటూ ఆరోపణ
- తమ పరువుకు భంగం కలిగిస్తున్నారంటూ సౌమ్యశెట్టిపై మౌనిక తండ్రి ఫిర్యాదు

విశాఖపట్నం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): చోరీ కేసులో సినీ నటి సౌమ్యశెట్టి అరెస్టు వ్యవహారం వివాదాస్పదమవుతోంది. నగరంలోని రైల్వే న్యూకాలనీలో గల తన స్నేహితురాలు మౌనిక పుట్టింట్లో సౌమ్యశెట్టి 75 తులాలు బంగారం అపహరించిందనే అభియోగంపై ఫోర్త్ టౌన్ క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేసి, ఆమెను అరెస్టు చేసిన విషయం తెలిసిందే. తాజాగా బెయిల్‌పై బయటకు వచ్చిన సౌమ్యశెట్టి తనను అన్యాయంగా చోరీ కేసులో ఇరికించారంటూ సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతోపాటు పలు యూట్యూబ్ ఛానళ్లకు ఇచ్చిన ఇంటర్వ్యూల్లో ఆరోపిస్తున్నారు. తాను చోరీ చేసి, హడావుడిగా బయటకు వెళ్లిపోయినట్టు సీసీ కెమెరా ఫుటేజీల్లో కనిపించిందని మౌనిక తండ్రి ప్రసాద్, పోలీసులు చెప్పడంలో వాస్తవం లేదంటోంది. తాను మౌనిక ఇంటి నుంచి బయటకు వచ్చినప్పుడు ఆమెతోపాటు ఆమె తల్లిదండ్రులు తమతోపాటే కిందకు వచ్చి కారు ఎక్కించారని, ఈ విషయం సీసీ ఫుటేజీ పరిశీలిస్తే తెలుస్తుందని సౌమ్యశెట్టి చెబుతోంది. పైగా ఆ నగలను మౌనికే తనకే ఇచ్చిందని సౌమ్యశెట్టి ఆరోపిస్తోంది. తనను అన్యాయంగా ఇరికించిన వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని, న్యాయపోరాటం చేసి తన నిజాయితీని నిరూపించుకుంటానని పేర్కొంటోంది. అయితే ఇలాంటి వీడియోల కారణంగా తన కుమార్తె మౌనిక మానసికంగా క్షోభకు గురవుతోందని, తమ కుటుంబం పరువు ప్రతిష్ఠలను భంగం వాటిల్లుతుందంటూ మౌనిక తండ్రి ప్రసాద్ శనివారం ఫోర్త్ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే పోలీసులు మాత్రం సివిల్ నేచర్ కింద రశీదు ఇచ్చి పంపించేసినట్టు తెలిసింది. చోరీ కేసులో సొత్తును స్వల్ప వ్యవధిలోనే రికవరీ చేశామని పోలీసులు గొప్పగా చెప్పుకున్నారు. అయితే క్రైమ్ విభాగంలో పనిచేస్తున్న ఒక అధికారి సొత్తును రికవరీ చేసినందుకు తమకు ఎంతో కొంత ఇవ్వాలంటూ బాధిత కుటుంబం నుంచి డబ్బు గుంజారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. ఈ కేసు తిరిగి తిరిగి ఎటు వెళుతుందోననే ఆందోళన ప్రస్తుతం పోలీసుల్లో వ్యక్తమవుతోంది.

ఎయిడెడ్

వైసీపీ హయాంలో పదుల సంఖ్యలో ఎయిడెడ్ విద్యా సంస్థలు మూత

- ఆస్తులతో సహా అప్పగించండి లేదంటే సిబ్బందిని సరండర్ చేయండి... సాయం మాత్రం చేయలేమంటూ చేతులెత్తేసిన సర్కారు
- గత్యంతరం లేక మూసివేసిన యాజమాన్యాలు
- సొంతంగా నడుపుతున్న మరికొంతమంది...
- పెరిగిన ఫీజుల భారం
- ఉమ్మడి జిల్లాలో పది వేల మంది విద్యార్థులపై ప్రభావం
- వచ్చే ఏడాది మరికొన్ని స్కూళ్లు ఎత్తివేతకు నిర్ణయం


మూతబడ్డ నగరంలోని సెయింట్ ఆంథోని పాఠశాల

విశాఖపట్నం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): **బ్రిటీష్ కాలం నుంచి నడుస్తున్న ఎయిడెడ్ సంస్థలకు రాష్ట్రంలో వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఫెహోరీ కట్టింది. ఎయిడెడ్ సంస్థలకు చెందిన ఆస్తులపై కన్నేసిన ప్రభుత్వం వ్యూహాత్మకంగా వాటిని స్వాధీనం చేసుకునేందుకు యత్నించింది. ఈ నేపథ్యంలో ఉమ్మడి విశాఖ జిల్లాలో గ్రాంట్ ఇన్ ఎయిడ్ కింద నడిచే ఎయిడెడ్ కళాశాలలు, ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో 80 నుంచి 90 శాతం వరకూ మూతపడ్డాయి. ఆ ప్రభావం వేలాది మంది విద్యార్థులపై పడింది. ఎయిడెడ్ విద్యా సంస్థలు మూతపడడంతో స్తోమత ఉన్నవారు ప్రైవేటు పాఠశాలలు/కళాశాలల్లో లేనివారు సమీపంలోని ప్రభుత్వ విద్యాసంస్థల్లో చేరారు. కొంతమంది మాత్రం చదువులకు దూరమయ్యారు.**

వైసీపీ ప్రభుత్వం 2019లో అధికారంలోకి వచ్చిన తరువాత ఎయిడెడ్ విద్యా సంస్థలను వదిలించుకునే ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. దీనికోసం మూడు రకాల ప్రతిపాదనలను యాజమాన్యాల ముందుంచింది. దీంట్లో మొదటిది... ఎయిడెడ్ సంస్థలను ఆస్తులు, సిబ్బందితో సహా ప్రభుత్వానికి అప్పగించడం, రెండు... ఆస్తులను సంబంధిత యాజమాన్యాల పరిధిలో ఉంచుకున్నా ప్రభుత్వం ఇచ్చే జీతాలతో పనిచేసే అధ్యాపక/ఉపాధ్యాయ/ఉపాధ్యాయేతర సిబ్బందిని వెనక్కి అప్పగించడం, మూడు...ప్రభుత్వం నుంచి సాయం ఆశించకుండా యాజమాన్యాలే సొంతంగా నడుపుకోవడం. ప్రభుత్వంతో గొడవ ఎందుకని జిల్లాలో తొలుత కళాశాలల యాజమాన్యాలు తమ వద్ద పనిచేసే అధ్యాపకులు, సిబ్బందిని ప్రభుత్వానికి సరండర్ చేశారు. ఏవీఎన్, బీవీకే, బుల్లయ్య కళాశాలల యాజమాన్యాలు తమ వద్ద పనిచేసే అధ్యాపకులను, సిబ్బందిని వెనక్కి పంపేశాయి. ప్రస్తుతం సొంతంగా కళాశాల నిర్వహిస్తున్నాయి. ప్రభుత్వం నుంచి ఎయిడ్ (సహాయం) రాకపోవడవ వల్ల విద్యార్థులు గతం కంటే ఎక్కువ ఫీజులు చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ మూడు కళాశాలల్లో సుమారు నాలుగు వేల మందికి పైగా విద్యార్థులు ఉన్నారు. వీరిలో బీసీ/ ఎస్సీ/ఎస్టీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ వర్తిస్తుందని ప్రభుత్వం చెబుతున్నా... చాలామందికి జమ కాలేదు. నా బీసీ... నా ఎస్సీ... నా ఎస్టీ... నా మైనారిటీ... అని తరచుగా సీఎం దీర్ఘాలు తీస్తుంటారు. అయితే ఎయిడెడ్ విద్యా సంస్థలు మూతపడడం వల్ల ప్రధానంగా ఆయా వర్గాలపై తీవ్ర ప్రభావం పడింది. ఏవీఎన్ కళాశాల యాజమాన్యం ప్రభుత్వ ఎయిడ్‌ను కాదని సొంతంగా నడుపుతోంది. ప్రభుత్వ ఉత్తర్వులను లెక్క చేయకుండా సెయింట్ జోసెఫ్, అనకాపల్లిలో ఎఎంఎఎల్ కళాశాల యాజమాన్యాలు మాత్రం ప్రభుత్వ ఎయిడ్‌తో బోధన కొనసాగిస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో దశాబ్దాల చరిత్ర ఉన్న ఎయిడెడ్ పాఠశాలలు మూతపడ్డాయి. ఈ జాబితాలో దక్షిణ భారతదేశంలో తొలితరం విద్యా సంస్థలుగా పేరున్న నగరంలోని సీబీఎం హైస్కూల్, ఏవీఎన్ ఉన్నత పాఠశాల, సెయింట్ ఆంథోని పాఠశాలలతోపాటు వేలాది మందికి విద్యను అందించిన ఎస్ఈ రైల్వే హైస్కూల్, ఎస్ఎడీ స్కూలు, సెయింట్ పీటర్స్ ఉన్నత పాఠశాల, నర్సీపట్నంలో ఆర్‌సీఎం ఉన్నత పాఠశాల ఉన్నాయి. ప్రాథమిక, యూపీ పాఠశాలలు పదుల సంఖ్యలో ఉన్నాయి. ఈ పాఠశాలల్లో సుమారు ఐదు వేల మంది వరకు చదువుకునేవారు. ఇక్కడ పనిచేసే టీచర్లు, సిబ్బందిని విద్యా శాఖ పరిధిలోని ప్రభుత్వ ... మిగతా 6వ పేజీలో

కన్నుల పండువగా అనంతుని తెప్పోత్సవం


కస్పయ్య కోనేరులో అనంత పద్మనాభస్వామి తెప్పోత్సవం. - వివరాలు I పేజీలో

విజయవాడ వర్క్‌షాపునకు టీడీపీ నేతలు





రానున్న ఎన్నికలకు సన్నద్ధం చేసే కార్యక్రమంలో భాగంగా అభ్యర్థులు, నియోజకవర్గాల ఇన్‌చార్జులు, పరిశీలకులను తెలుగుదేశం పార్టీ అధిష్ఠానం శనివారం విజయవాడలో వర్క్‌షాపు నిర్వహించింది. వర్క్‌షాపునకు ఉమ్మడి విశాఖ జిల్లాకు చెందిన అభ్యర్థులు చింతకాయల అయ్యన్నపాత్రుడు, ఎం.శ్రీభరత్, వెలగపూడి రామకృష్ణబాబు, పి.గణబాబు, పల్లా శ్రీనివాసరావు, వంగలపూడి అనిత, కేఎస్ఎన్ఎస్ రాజు, పైలా ప్రసాదరావు, దొన్నుదొర హాజరయ్యారు. ఇంకా పార్టీ నేతలు బుద్దా నాగజగదీశ్వరరావు, గండి బాబ్జి, ప్రగడ నాగేశ్వరరావు, పీలా గోవింద, చోడే పట్టాభి, పుచ్చా విజయకుమార్, బొండా జగన్, తదితరులు పాల్గొన్నారు. - విశాఖపట్నం/ఆంధ్రజ్యోతి

ప్రభుత్వ భూములకు ఎసరు!

ఆనందపురం మండలంలో డీపట్టాదారులకు ఇచ్చిన భూములు చేతులు మారాయనే కారణంతో కేటాయింపులు రద్దు చేసిన అధికారులు

- రామవరం, భీమన్నదొరపాలెం, కోలవానిపాలెం గ్రామాల పరిధిలో సుమారు 60 ఎకరాలు...
- అప్పటి నుంచి ప్రభుత్వ ఆధీనంలోనే...
- ఇప్పుడు వాటికి సంబంధించిన ఫైలు మాయం



- అవి పట్టాదారుల చేతుల్లోనే ఉన్నాయని రికార్డుల్లో ట్యాంపరింగ్ చేసి రెగ్యులరైజ్ చేయించుకునేందుకు కొనుగోలుదారుల యత్నం
- తెరవెనుక వైసీపీ కీలక నేతలు

విశాఖపట్నం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): పేద రైతులకు రెండు దశాబ్దాలకు ముందు ఇచ్చిన డీఫారం భూములను రెగ్యులర్ చేస్తున్న నేపథ్యంలో ఆనందపురంలో అధికార పార్టీ నేతలు అనేక అక్రమాలకు పాల్పడుతున్నారు. ఇతరులకు విక్రయించినట్టు గుర్తించి రద్దు చేసిన డీఫారం భూముల వివరాలతో కూడిన ఫైలును మండల తహసీల్దార్ కార్యాలయం నుంచి మాయం చేశారు. మండలంలో రామవరం, భీమన్నదొరపాలెం, కోలవానిపాలెం గ్రామాల పరిధిలో సుమారు 60 ఎకరాలను సదరు పట్టాదారులు నిబంధనలకు విరుద్ధంగా విక్రయించినట్టు గుర్తించి గతంలో కేటాయింపులు రద్దు చేశారు. మండలంలో మరికొన్ని గ్రామాల్లో ఈ విధంగా భూ కేటాయింపులు రద్దు చేసినట్టు చెబుతున్నారు.

గ్రామాల్లో పేద కుటుంబాలకు 1970 తరువాత ప్రభుత్వం సాగు కోసం (డీపట్టాలు) భూములు ఇచ్చింది. ఈ ప్రక్రియ 2000 సంవత్సరం వరకు సాగింది. అయితే ఆ భూములను చాలామంది అమ్మేసుకున్నారు. ముఖ్యంగా ... మిగతా 6వ పేజీలో

నేటి నుంచి ఐపీఎల్ మ్యాచ్‌ల టికెట్ల అమ్మకం

- ఢిల్లీ క్యాపిటల్స్-కోల్‌కతా నైట్‌రైడర్స్ మ్యాచ్‌కు నేటి నుంచి ఆన్‌లైన్‌లో విక్రయం
- ఢిల్లీ క్యాపిటల్స్-చెన్నై సూపర్‌కింగ్స్ మ్యాచ్‌కు ఈనెల 27 నుంచి...
- టికెట్ల ధరలు: రూ.1,000, 1,500, 2,000, 3,000, 3,500, 5,000, 7,500

విశాఖపట్నం (స్పోర్ట్సు), మార్చి 23: నగరంలోని ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో జరగనున్న ఐపీఎల్ మ్యాచ్‌లకు సంబంధించి టికెట్ల అమ్మకాలు ఆదివారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఏప్రిల్ 3న ఢిల్లీ క్యాపిటల్స్-కోల్‌కతా నైట్‌రైడర్స్ మధ్య జరిగే మ్యాచ్‌కు సంబంధించిన టికెట్ల విక్రయాలు పేటీఎం ఇన్‌సైడర్ వెబ్‌సైట్ ద్వారా ఉదయం 10 గంటల నుంచి ... మిగతా 6వ పేజీలో

వీడిన మిస్టరీ

- మాజీ ఎమ్మెల్యే ఇంట్లో దోపిడీకి పాల్పడింది ఆయన కుటుంబ గురించి తెలిసిన వ్యక్తే
- అప్పులు తీర్చేందుకు చోరీకి ప్రణాళిక
- హైదరాబాద్‌లో నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

- వార్త 6వ పేజీలో

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (ఆది)	6.12
సహరి (సోమ)	4.42

స్కానర్ ఉన్నా... ప్రయోజనం సున్నా!

- కంటెయినర్‌లో ఏ వస్తువు ఉన్నదీ గుర్తించలేదు
- ప్రత్యక్ష తనిఖీలు పెంచాల్సిందే


పోర్టులోని కంటైనర్ స్కానర్

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖపట్నం పోర్టుకు బ్రెజిల్ నుంచి డ్రగ్స్ భారీమొత్తంలో దిగుమతి కావడంతో ఇప్పుడు అందరి దృష్టి ఇక్కడి వ్యవహారాలపై పడింది. ఇది అత్యంత సురక్షితం, పెద్దగా తనిఖీలు జరగవని తెలిసే ఇక్కడికి దిగుమతి చేశారనే వాదన వినిపిస్తోంది. ఎంతకాలంగా ఇలా డ్రగ్స్ వస్తున్నాయో తెలియదు గానీ ఇప్పుడు ఇంటర్‌పోల్ సమాచారంతో గుట్టు రట్టయింది. సీబీఐ సీరియస్‌గా విచారణ చేస్తోంది. అయితే ఇప్పుడు కంటెయినర్లలో ఇలా డ్రగ్స్‌తోపాటు ఇంకేమి వస్తున్నాయోనని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అలా ఏమైనా తెస్తే పరిస్థితి ఏమిటి?...అనే ప్రశ్నలూ వినిపిస్తున్నాయి.

స్కానర్ ఉన్నా... కొంత వరకే

కంటెయినర్ రవాణా పెరగడం, కస్టమ్స్ అధికారులు ప్రతి కంటెయినర్‌ను ప్రత్యక్షంగా పరిశీలించడం సాధ్యం కావడం లేదని గుర్తించిన అధికారులు మూడేళ్ల క్రితం కంటెయినర్ టెర్మినల్‌లో మొబైల్స్ ఎక్స్‌రే కంటెయినర్‌ను రూ.30 లక్షలతో కొనుగోలు చేశారు. ఇది గంటకు 20 కంటెయినర్లను స్కాన్ చేస్తుంది. అయితే కంటెయినర్‌లో ఏమున్నాయో వాటి రూపురేఖలు, అవుట్‌లైన్లు, పరిమాణం కనిపిస్తుందే తప్ప ఇతర ... మిగతా 6వ పేజీలో

కొవిడ్ తర్వాత పెరిగిన గుండె సంబంధిత వ్యాధులు

» కెనడాకు చెందిన ప్రముఖ కార్డియాలజిస్టు మామ్స్‌మామ్స్


సదస్సులో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న వైద్య నిపుణులు

మహారాణిపేట, మార్చి 23: కొవిడ్ అనంతరం జనాల్లో గుండె సంబంధిత వ్యాధులు పెరిగినట్టు కెనడాకు చెందిన ప్రముఖ కార్డియాలజిస్టు మామ్స్‌మామ్స్ అన్నారు. నగరంలో తొలిసారిగా 16వ ఉమెన్ కార్డియక్ కేర్- 2024 పేరిట సదస్సు శనివారం హోటల్ నోవాటెల్‌లో ప్రారంభమైంది. ఈ సదస్సుకు విదేశాలకు చెందిన హృద్రోగ నిపుణులు హాజరయ్యారు. విదేశాలను నుంచి వైద్య నిపుణులు ప్రత్యక్ష ప్రసారాల ద్వారా శస్త్ర చికిత్సలు చేసి చూపి వాటిని విశ్లేషించారు. అనంతరం కెనడాకి చెందిన మామ్స్‌మామ్స్ మాట్లాడుతూ కొవిడ్ తర్వాత హృద్రోగాలపై ప్రజల్లో అవగాహన పెరిగిందన్నారు. ప్రతీ ఒక్కరూ వ్యాయామం, ఆహార నియమాలపై శ్రద్ధ వహించటం ద్వారానే మెరుగైన ఆరోగ్యం సాధ్యమన్నారు. ప్రధానంగా మహిళలు హృద్రోగాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. అంతర్జాతీయ వైద్య నిపుణులు కార్డియో వ్యాస్క్యులర్ మెడిసిన్, శస్త్ర చికిత్సలు, పరిశోధనలపై చర్చించారు. నూతన చికిత్సా విధానాలను వివరించారు. రెండు రోజులపాటు జరిగే ఈ సదస్సుకు జపాన్, బ్రిటన్, కెనడా, సౌదీ, అరేబియా తదితర దేశవిదేశాల నుంచి సుమారు 400 మందికిపైగా వైద్య నిపుణులు హాజరయ్యారు. నటాలియో పీనాలీ, మిరావట్ అలాసాంగ్, వి. రమాబాలా, వి. సుజాత తదితర వైద్యులు పాల్గొన్నారు.

అమూల్ దుకాణాలు ధమాల్

» గెడ్డలు, కాలువలు, బస్టాప్ ఆక్రమిత స్థలాల్లో ఏర్పాటు
» పాల వ్యాపారంపై ఆసక్తి చూపని యువత
» అనేక చోట్ల నిరుపయోగంగా ఐరన్ బడ్డీలు


మాధవధార రోడ్డులో చెత్తకుప్పల మధ్య అమూల్ బడ్డీ

మురళీనగర్, మార్చి 23; ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా తీసుకున్న అమూల్ పాల ఉత్పత్తి విక్రయదుకాణాలకు నగరంలో పెద్దగా స్పందన కానరావడంలేదు. రహదారుల ఆక్రమించి మరీ ఏర్పాటుచేసిన ఈ దుకాణాలు నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. ఏడాది కిందట జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ విభాగం పర్యవేక్షణలోనే అమూల్ సంస్థ వ్యాపారాభివృద్ధిలో భాగంగా వీటిని అనేకచోట్ల కాలువలు, గెడ్డల పక్కన, బస్టాప్‌లను సైతం ఆక్రమించి మరీ ఏర్పాటుచేశారు. యువ పారిశ్రామిక వేత్తలను తయారు చేద్దాం అనే బృహత్తర ప్రణాళికలో భాగంగా వీటిని నెలకొల్పారు. కానీ, విశాఖ ఉత్తర నియోజకవర్గంలో యువత ఎవరూ ఈ వ్యాపార అవకాశాన్ని అందిపుచ్చుకోవడానికి ముందుకు రాలేదు. జీవీఎంసీ ప్రాంతాన్ని బట్టీ రూ.లక్షకు పైగా డిపాజిట్ చేసి, తిరిగి నెలకు అద్దె వసూలుపై ఈ అమూల్ పాల దుకాణాలు ఏర్పాటుచేయాలన్న నిబంధనలతో యువతనుంచి స్పందన కరువైంది. దీంతో బడ్డీలు అలాగే మిగిలిపోతున్నాయి. తెరవకుండానే ఇనుప దుకాణాలు తుప్పు పట్టిపోతున్నాయి. చెత్తా చెదారాల మధ్య 51వ వార్డు మాధవధార రోడ్డులో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సమీపాన, అంబేడ్కర్ కాలనీ వద్ద ఏర్పాటుచేసిన ఈ దుకాణాలు వృధాగా దర్శనమిస్తున్నారు. ఇలా ప్రతి వార్డులో ఏదో ఒకచోట ఈ దుకాణాలు ఖాళీగా ఉంటున్నాయి. 2022 మార్చిలో ఆర్టీఓ ఆఫీసు రోడ్డుకి ఇరువైపులా ఏళ్ల తరబడి ఉన్న ప్రైవేట్ దుకాణాలను జీ-20 సదస్సుల పేరిట తొలగించారు. అనంతరం వ్యాపారులు అనేక నిరసనల తర్వాత వేరే చోట పెట్టుకునేందుకు అనుమతి ఇచ్చారు. మరోవైపు అవే వార్డులో రోడ్లకు ఇరువైపులా అమూల్ దుకాణాలు ఎవరు తీసుకోకుండా తుప్పు పట్టి పోతున్నా జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ పట్టించుకోకపోవడంతో ఇతర వ్యాపారులు తీవ్ర అసహనం వ్యక్తంచేస్తున్నారు.

స్వాతంత్రోద్యమంలో భగత్‌సింగ్‌ది ప్రత్యేక చరిత్ర


భగత్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సిఐటియు నాయకులు

పూర్ణామార్కెట్, మార్చి 23: భారతదేశ స్వాతంత్ర్య పోరాటంలో భగత్‌సింగ్‌ది ప్రత్యేక చరిత్ర అని సీఐటీయూ నాయకులు ఎం.సుబ్బారావు, వై.రాజు అన్నారు. శనివారం భగత్ సింగ్ వర్ధంతిని పురస్కరించుకుని పూర్ణామార్కెట్, కొత్తరోడ్డు వద్ద ముఠా కార్మికులతో కలసి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, స్వాతంత్ర్య పోరాటంలో బ్రిటీష్ పాలకులకు భగత్‌సింగ్ సింహస్వప్నంగానిలిచారన్నారు. భారతమాత కోసం ప్రాణాలను త్యాగం చేసిన మహానుభావుడిగా వినుతికెక్కారన్నారు. అటువంటి యోధుడిని ఆదర్శంగా తీసుకుని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. నాటి బ్రిటీష్ పాలకులకు నేటి పాలకులకు తేడా లేదని విమర్శించారు. భగత్ సింగ్ విప్లవ స్ఫూర్తితో కార్మికులు ముందుకు సాగాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు చంద్రమౌళి, కార్మికులు పాల్గొన్నారు.

అభయ ఆంజనేయ స్వామికి పూజలు

అక్కయ్యపాలెం, మార్చి 23: గ్రేటర్ 45వ వార్డు తాటిచెట్లపాలెంలోని సుందర అభయ ఆంజనేయ స్వామి ఆలయంలో వార్డు సోషల్ మీడియా ఇన్‌చార్జి మాత ఈశ్వర్ ఆధ్వర్యంలో వేద పండితులు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వైసీపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కేకే రాజు, ఎన్నికల పరిశీలకుడు చొక్కాకుల వెంకటరావు ఆంజనేయ స్వామిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో వార్డు వైసీపీ అధ్యక్షుడు పైడి రమణ, నాయకులు హరి పట్నాయక్, గణపతి, శ్యామ్, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

రైల్వే మాంటిస్సోరి స్కూల్‌లో గ్రాడ్యుయేషన్ డే


వేడుకల్లో విద్యార్థులతో డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్, మహిళలు

విశాఖపట్నం, మార్చి 23: తూర్పుకోస్తారైల్వే మహిళ సంక్షేమ సంఘం వాల్తేరు డివిజన్ శాఖ నిర్వహిస్తున్న అనురాగ్ మాంటిస్సోరి స్కూల్‌లో శనివారం గ్రాడ్యుయేషన్ దినోత్సవం జరిగింది. న్యూ ఆఫీసర్స్ క్లబ్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి డీఆర్ఎం సౌరభ్‌ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై చిన్నారులను అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పిల్లల సమగ్ర అభివృద్ధికి అనుకూల అభ్యాసనా వాతావరణం అవసరమని పేర్కొన్నారు. స్కూల్‌లో సీసీ కెమెరాలు, ఆడియో విజువల్ ఇంటరాక్టివ్ క్లాసురూమ్ తదితర ఆధునిక సౌకర్యాలు, టీచింగ్ మెథడాలజీలతో అత్యుత్తమంగా స్కూల్‌ను నిర్వహిస్తున్న వాల్తేరు రైల్వే మహిళా సంఘం (ఈకార్వో) ప్రతినిధులు అభినందనీయులని ప్రశంసించారు. ఈకార్వో అధ్యక్షురాలు మంజుశ్రీ ప్రసాద్ మాట్లాడుతూ పిల్లల్లో చదువుతోపాటు సామాజిక అంశాలపై అవగాహన, సానుకూల ఆలోచనలను పెంపొందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏడీఆర్ఎంలు సుధీర్‌కుమార్ గుప్తా, మనోజ్‌కుమార్ సాహు, ఈకార్వో ప్రతినిధులు మధుమిత సాహు, సంయుక్త తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధిగా కమలాకరరావు

సీతమ్మధార, మార్చి 23: కాంగ్రెస్ పార్టీ విశాఖ జిల్లా అధికార ప్రతినిధిగా ఉత్తరనియోజకవర్గం సీతమ్మధార ప్రాంతానికి చెందిన జీవీపీఎస్ కమలాకరరావును నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ అవకాశాన్ని కల్పించిన ఏపీసీసీ వైఎస్ షర్మిల రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. ఈ నియామక పత్రాన్ని విశాఖ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడినుంచి ఆయన అందుకున్నారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించండి

» ద్వారకా స్టేషన్ సీఐ రమేశ్

సీతమ్మధార, మార్చి 23: ద్వారకా పోలీసు స్టేషన్ పరిధి సీతంపేట, రెల్లివీధి, హరిజనవీధి, సీతమ్మధార బిలాల్ కాలనీ తదితర ప్రాంతాల్లో సీఐ రమేశ్ ఆధ్వర్యంలో శనివారం బెటాలియన్ సిబ్బంది కవాతు నిర్వహించారు. రానున్న ఎన్నికల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సహకరించాలని ఈసందర్భంగా స్థానికులకు సీఐ సూచించారు. పూర్తి పోలీసు బందోబస్తుతో ఎన్నికల సమయంలో అందుబాటులో ఉంటామన్నారు.


కవాతులో పాల్గొన్న ద్వారకాస్టేషన్ సీఐ రమేశ్, సిబ్బంది

ఎన్ఏడీ జంక్షన్‌లో విస్తృత తనిఖీలు

మర్రిపాలెం: ఎన్నికల నేపథ్యంలో శనివారం విశాఖ జిల్లా ఎస్ఈబీ అడిషనల్ ఎస్పీ బి.శ్రీనివాసరావు ఆదేశాలమేరకు అసిస్టెంట్ సూపరిటెండెంట్ యు.సుబ్బారావు ఆధ్వర్యంలో ఎన్ఏడీ జంక్షన్ పరిసర ప్రాంతాల్లో డాగ్ స్క్వాడ్‌తో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. కొరియర్ సర్వీసుకేంద్రాలతోపాటు అనుమానాస్పద ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టినట్టు ఎస్ఈబీ సీఐ ఉపేంద్ర తెలిపారు. ఇంటెలిజెన్స్ ఇన్‌స్పెక్టర్ రాజులునాయుడు,ఎస్ఐలు జి.దాసు, వేణుగోపాల్, సిబ్బంది పాల్గొన్నారు.


ఎన్ఏడీ ప్రాంతంలో డాగ్‌స్కాడ్ తనిఖీల్లో ఎస్ఈబీ పోలీసులు

సీతంపేట: అపార్టుమెంట్లు, ఇళ్లలోకి అనుమానితులు ఎవరైనా ప్రవేశిస్తే ప్రశ్నించాలని నాలుగో పట్టణ పోలీసు స్టేషన్ ఎస్ఐ వెంకటరావు పేర్కొన్నారు. దొంగతనాలు, సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తూ సమావేశాలను ఏర్పాటు చేశారు. అనుమానాస్పదంగా వ్యక్తులు కనిపిస్తే వెంటనే తమకు సమాచారం ఇవ్వాలని కోరారు.

తుదిదశకు చేరిన వాలీబాల్ టోర్నీ


తలపడుతున్న క్రీడాకారులు

విశాఖపట్నం (స్పోర్ట్సు), మార్చి 23: వాల్తేరు రైల్వే క్రీడా సముదాయంలో జరుగుతున్న నాల్గవ డీఆర్ఎం కప్ అఖిల భారత పురుషులు, మహిళల వాలీబాల్ చాంపియన్‌షిప్ టోర్నీ చివరి దశకు చేరింది. శనివారం జరిగిన చివరి లీగ్ మ్యాచ్‌లో ఆతిథ్య తూర్పుకోస్తారైల్వే 25-18, 25-21 (2-0) స్కోరుతో శాప్ హైదరాబాద్‌పై గెలుపొంది సెమీఫైనల్స్‌కు చేరింది. ఇక ప్రకాశం జిల్లా 2-0 స్కోరుతో శాయ్ హాస్టల్ యానంపై, ఈస్ట్ గోదావరి 2-0 స్కోరుతో శ్రీకాకుళంపై, కృష్ణా జట్టు 2-1 స్కోరుతో కిట్స్ యూనివర్సిటీ భువనేశ్వర్‌పై విజయం సాధించి సెమీఫైనల్స్ చేరాయి.

ముగిసిన జాతీయ సదస్సు


సదస్సులో పాల్గొన్న అతిథులు, అధ్యాపకులు

జ్ఞానాపురం, మార్చి 23: స్థానిక సెయింట్ జోసెఫ్ కళాశాలలో సైకాలజీ, కామర్స్, మేనేజ్‌మెంట్ విభాగాల ఆధ్వర్యంలో వ్యాపార నిర్వహణలో అభివృద్ధి చెందుతున్న పోకడలపై రెండు రోజులపాటు జరిగిన జాతీయ సదస్సు శనివారంతో విజయవంతంగా ముగిసినట్టు ప్రిన్సిపాల్ డా.సిస్టర్ షైజీ తెలిపారు. ముఖ్యఅతిథిగా ఏయూ అకడమిక్ అఫైర్స్ డీన్ ఆచార్య కిశోర్ బాబు, హైదరాబాద్ డా.బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఆచార్య డా. జనార్ధనరెడ్డి హాజరయ్యారు. ఆచార్య కిషోర్ బాబు మాట్లాడుతూ విద్యార్థులు సంకల్పబలం, క్రమశిక్షణతో నైపుణ్యాలు పెంచుకోవాలన్నారు. ఇలాంటి సదస్సుల్లో పాల్గొనడం ద్వారా మేధస్సుకు మరింత పదను పెట్టుకొనే అవకాశం ఉంటుందన్నారు. ఈ సదస్సులో పాల్గొన్న వారికి ప్రమాణపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో కన్వీనర్ డాక్టర్ డి.రాజ్యలక్ష్మి, సిబిల్ రత్న, డా.హేమ, డా.రజని, డా.హదసా, పావని, ప్రత్యూష, డాక్టర్ అరుణ, డాక్టర్ సుద, జయలక్ష్మి పాల్గొన్నారు.

సంగీతంలో ఐవీఎల్ శాస్త్రి సేవలు నిరుపమానం


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న దృశ్యం

డాబాగార్డెన్స్, మార్చి 23: ప్రముఖ దివంగత ఇంద్రకంటి వెంకటలక్ష్మణశాస్త్రి శాస్త్రీయ సంగీతంలో శిఖరాయమానంగా వెలుగొందారని ఇంద్రగంటి రామచంద్రమూర్తి పేర్కొన్నారు. శనివారం డాబాగార్డెన్స్ ఐవీఎల్ శాస్త్రి సంగీత సమితి కార్యాలయంలో ఐవీఎల్ 97 వ జయంతి వేడుకలను నిర్వహించారు. ఐవీఎల్ శాస్త్రి సంగీత సమితికి సంబంధించిన ఉచిత శాస్త్రీయ సంగీత శిక్షణ కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం ఆయన శాస్త్రి సేవలను కొనియాడారు. ఆధ్యాత్మిక వేత్త ఎం.వి.రాజశేఖర్ మాట్లాడుతూ విశాఖలో సంగీత జనకులం స్థాపించి తద్వారా వేలాది మందికి శాస్త్రీయ సంగీతాన్ని నేర్పించిన ఘనత ఐవీఎల్‌కే దక్కుతుందన్నారు. ఐవీఎల్ శాస్త్రి సంగీత సమితి సారథ్యంలో ఈ నెల 31న ఉదయం 6 గంటలకు శ్రీరాఘవేంద్రస్వామిమఠంలో ఉచిత శాస్త్రీయ సంగీత శిక్షణకు దరఖాస్తులు, పోటీ పరీక్ష నిర్వహిస్తామన్నారు. వివరాలకు 94407 88809ను సంప్రదించాలన్నారు.

ఎన్నికల నియమావళి తూచ్..

» యథాతథంగా ఎండీయూ వాహనంపై ప్రచార పోస్టర్లు

కంచరపాలెం, మార్చి 23: ప్రభుత్వ సంక్షేమ పథకాల వివరాలను మూసి వేయకుండా ఉన్న ఈ ఎండీయూ వాహనం కంచరపాలెం రైతుబజార్ సమీపంలోనిది. ఎన్నికల నియమావళి ప్రకారం ఈ ప్రజా పంపిణీ వాహనాలపై ఉన్న సీఎం బొమ్మతో పాటు ప్రభుత్వం అమలుచేసే పథకాల వివరాలను మూసివేయాల్సి ఉన్నా అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. దీనిపై ఫిర్యాదులు వెల్లువెత్తున్నాయి.



కంచరపాలెంలో ప్రజాపంపిణీ వాహనంపై పథకాల వివరాలు

వీడిన మిస్టరీ

-మాజీ ఎమ్మెల్యే ఇంట్లో దోపిడీకి పాల్పడింది ఆయన కుటుంబ గురించి తెలిసిన వ్యక్తే ..

విశాఖపట్నం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నేత, మాజీ ఎమ్మెల్యే తైనాల విజయ్‌కుమార్ ఇంట్లో జరిగిన దోపిడీ కేసును పోలీసులు ఛేదించారు. తైనాల కుటుంబం గురించి బాగా తెలిసిన వ్యక్తే నిందితుడని పోలీసులు గుర్తించారు. అతడిని హైదరాబాద్‌లో అదుపులోకి తీసుకుని నగరానికి తీసుకొచ్చి విచారిస్తున్నారు. దీనికి సంబంధించి విశ్వసనీయ సమాచారం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం సమీపంలోని ఒక గ్రామానికి చెందిన యువకుడు కొన్నాళ్ల కిందట డాబాగార్డెన్స్ లలితానగర్‌లోని తైనాల విజయ్‌కుమార్ నివాసానికి వచ్చాడు. తైనాల బంధువుల పేర్లు ప్రస్తావించి వారంతా తనకు తెలిసిన వారేనంటూ మాటలు కలిపాడు. ఇంట్లో తైనాలతోపాటు ఆయన భార్య మాత్రమే ఉంటున్నారని గుర్తించాడు. తైనాల లేని సమయంలో ఇంట్లో దోపిడీ చేస్తే...తన అప్పులు తీరిపోతాయనుకున్నాడు. తన పథకం అమలు చేయడానికి తైనాల దినచర్యపై కొద్దిరోజులుగా నిఘా పెట్టాడు. ఎస్.కోట నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్న తైనాల ఎన్నికల షెడ్యూల్ విడుదలైన తర్వాత ప్రతిరోజూ మధ్యాహ్నం ఇంటి నుంచి బయలుదేరి తిరిగి రాత్రికి చేరుకుంటున్నట్టు గుర్తించాడు. ఈనెల 21న తైనాల ఎస్‌కోటలో ఎన్నికల ప్రచారానికి వెళ్లిపోవడంతో రాత్రి ఏడున్నర సమయంలో కత్తి పట్టుకుని ఇంట్లోకి చొరబడ్డాడు. తన ఆనవాళ్లు తెలియకుండా ఉండేందుకు ముఖానికి మాస్క్, నెత్తిన టోపీ ధరించాడు. కిచెన్‌లో వంటచేస్తున్న తైనాల భార్య మెడపై కత్తిపెట్టి తాను చెప్పినట్టు వినకపోతే చంపేస్తానని బెదిరించాడు. బీరువాలోని బంగారం, నగదు తీసి ఇవ్వాలని చెప్పడంతో ఆమె ప్రాణభయంతో అలాగే చేశారు. నిందితుడికి అప్పు ఇచ్చిన వ్యక్తి అదే సమయంలో ఫోన్ చేశాడు. 'ఏడున్నరకు డబ్బు లు తీసుకోవడానికి డాబాగార్డెన్స్‌కు రమ్మన్నావ్. నేను అక్కడే ఉన్నా. నువ్వు ఇంకా రాలేదేమంటూ' ప్రశ్నించాడు. దీనికిసమాధానంగా నిందితుడు...'అదేపనిలో ఉన్నా, వచ్చేస్తున్నా' అంటూ సమాధానం ఇచ్చాడు. తర్వాత బంగారం, నగదుతో ఇంటి నుం చి బయటపడ్డాడు. నడుచుకుంటూ డాబాగార్డెన్స్ రోడ్డులోకి వెళ్లి అక్కడ తాను బాకీ ఉన్న వ్యక్తికి తాను దోపిడీ చేసిన డబ్బులో కొంత ఇచ్చాడు.అక్కడ ఆటో ఎక్కి కాన్వెం ట్ జంక్షన్ మీదుగా ఎన్ఏడీకి చేరుకున్నాడు. అక్కడ బస్సు ఎక్కి రాజమండ్రి వెళ్లి, అక్కడి నుంచి రైలులో హైదరాబాద్ వెళ్లిపోయాడు. అప్పటికే పోలీసులు నిందితుడి ఆచూకీని సీసీ కెమెరాల పుటేజీతోపాటు సెల్‌ఫోన్ టవర్ లొకేషన్ ఆధారంగా గుర్తించారు. అతడిని ట్రాకింగ్ చేస్తూ ప్రత్యేక బృందం హైదరాబాద్ వెళ్లి నిందితుడిని అదుపులోకి తీసుకుంది. దోపిడీ చేసిన నగలను కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నట్టు సమాచారం. నిందితుడిని నగరానికి తీసుకొచ్చి పోలీసులు విచారిస్తున్నట్టు తెలిసింది. ఆదివారం పూర్తి వివరాలను మీడియాకు వెల్లడించే అవకాశం ఉంది.

ఎయిడెడ్

... 5వ పేజీ తరువాయి

స్కూళ్లకు బదిలీ చేశారు. ఆయా పాఠశాలలు మూతపడడంతో అక్కడ చదువుకునే పేద విద్యార్థులు చెల్లాచెదురయ్యారు. ఏవీఎన్, సీబీఎం, సెయింట్ ఆంథోనీ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులు సమీపంలోని జీవీఎంసీ పాఠశాలల్లో చేరారు. కూతవేటు దూరంలో ఉన్న స్కూలు నుంచి మూడు నుంచి నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న పాఠశాలలకు పిల్లలు వెళ్లాల్సి రావడంతో అప్పట్లో తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తంచేశారు. ఇంకా జ్ఞానాపురంలో సెయింట్ పీటర్స్ బాయ్స్ స్కూలు మూసివేతతో కంచరపాలెం రామ్మూర్తిపంతులుపేట జీవీఎంసీ పాఠశాలకు, రైల్వే స్టేషన్ ఎదురుగా ఉన్న రైల్వే స్కూలు, మర్రిపాలెంలోని ఎస్ఈ రైల్వే స్కూలు మూతతో నాలుగు కిలోమీటర్ల దూరంలోని గోపాలపట్నం పాఠశాలకు విద్యార్థులు వెళ్లాల్సి వచ్చింది. కొద్దోగొప్పో స్థోమత ఉన్న కుటుంబాలు తమ పిల్లలను ఇంటికి సమీపంలో ఉన్న ప్రైవేటు స్కూళ్లల్లో చేర్పించుకోగా, పేద కుటుంబాలు దూరమైనా గత్యంతరం లేక ప్రభుత్వ పాఠశాలలకు పంపాయి. మరికొందరైతే పిల్లలను చదువు మాన్పించినట్టు ఎయిడెడ్ పాఠశాలలో పనిచేసిన టీచర్ ఒకరు తెలిపారు. ప్రధానంగా బాలికలు చదువుకు దూరమయ్యారని ఆవేదన వ్యక్తంచేశారు. ఇక భీమిలిలో సెయింట్ ఆన్స్ పాఠశాల వచ్చే విద్యా సంవత్సరం నుంచి మూతపడనున్నది. విద్యా రంగ అభివృద్ధికి గడచిన ఐదేళ్లుగా తాము ఎంతో కృషిచేశామని వైసీపీ ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటోంది. కానీ ఎయిడెడ్ విద్యా సంస్థలను విషయంలో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వల్ల వేలాది మంది విద్యార్థులు ఇబ్బందిపడ్డారు. అనేకమంది చదువుకు దూరం అయ్యారు.

ప్రభుత్వ భూములకు ఎసరు!

... 5వ పేజీ తరువాయి

నగర పరిధి, శివారు ప్రాంతాల్లో పట్టా భూములు చేతులు మారినట్టు గతంలో ఫిర్యాదులు రావడంతో రెవెన్యూ అధికారులు విచా రణ చేపట్టారు. ఆనందపురం మండలంలో పలు గ్రామాల్లో భారీఎత్తున అమ్మకాలు జరిగినట్టు విచారణలో తేలడంతో వాటిని రద్దు చేయాలని అప్పటి అధికారులు జిల్లా కలెక్టర్‌కు సిఫారసు చేశారు. ఈ విధంగా రామవరం, భీమన్న దొరపాలెం, కోలవానిపాలెంలో సుమారు 60 ఎకరాల కేటాయింపు రద్దు చేశారు. ఈ నేపథ్యంలో ఆయా భూముల్లో రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డులు పెట్టారు. అయితే రైతుల నుంచి భూములు కొనుగోలు చేసిన వారిలో ఎక్కువగా రాజకీయ నాయకులు, పెద్ద వ్యాపారులు ఉన్నారు. భూములు స్వాధీనం చేసుకోకుండా వారు ఉన్నత స్థాయిలో చక్రంతిప్పారు. ఇదిలావుండగా జగనన్న కాలనీలకు డీ.ఫారం భూములు సేకరించే సమయంలో గతంలో పట్టాలు రద్దు చేసిన వాటి వివరాలకు సంబంధించిన ఫైలును మాయం చేశారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. తాజాగా డీ.ఫారం భూములను రెగ్యులర్ (ఇరవై సంవత్సరాల క్రితం ఎవరికైతే ఇచ్చారో...వారి చేతుల్లో ఉన్నవాటిని మాత్రమే) చేయడానికి ప్రభుత్వం ముందుకురావడంతో అప్పుడు భూములు కొనుగోలు చేసిన వ్యక్తులు అధికార పార్టీ నేతలను ఆశ్ర యించారు. పొరుగు జిల్లాలో కీలక నేత ఒకరు రంగంలోకి దిగి మూడు గ్రామాల్లో భూముల రెగ్యులర్‌కు చక్రం తిప్పినట్టు ఆరోపణలు వస్తున్నాయి. ఆనందపురంలో గతంలో పనిచేసిన ఇద్దరు తహసీల్దార్లపై ఒత్తిడి తీసుకువచ్చి రామవరం, భీమన్నదొరపాలెం, కోలవానిపాలెంలో సుమారు 60 ఎకరాలను రెగ్యులరైజ్ చేసేందుకు రంగం సిద్ధం చేశారని ప్రచారం సాగుతుంది. డిపట్టాదారులకు ఇచ్చిన భూములు చేతులు మారినట్టు తేలడంతో కేటాయింపులు రద్దు చేశారు. అవి ప్రస్తుతం ప్రభుత్వ ఆధీనంలో ఉన్నాయి. కానీ డి.పట్టాదారుల చేతిలో ఉన్నట్టు రికార్డులను ట్యాంపరింగ్ చేసినట్టు తెలిసింది. ప్రస్తుత మార్కెట్ ధర ప్రకారం ఈ భూముల విలువ సుమారు రూ.150 కోట్ల మేర ఉంటుంది.

భీమన్నదొరపాలెంలో 12 సర్వేనంబర్లు, రామవరం, కోల వానిపాలెంలో చెరో 11 సర్వే నంబర్లులో డి.ఫారం భూములు చేతులు మారినట్టు గుర్తించారు. వీటిలో చాలా వరకు భూములు ప్రస్తుతం ప్రభుత్వ గయాలు (బంజరు)గా ఆన్ లైన్‌లో కనిపిస్తున్నాయి. అయితే అడ్డగోలుగా వ్యవ హరించే కొందరు అధికారుల దన్నుతో రికార్డులు ట్యాంపరింగ్ చేసి అప్పట్లో డి.ఫారం పొందిన వారి పేర్లు నమోదు చేయించాలని పొరుగు జిల్లా వైసీపీ నేత ఉత్తరాంధ్రలో పార్టీని పర్యవేక్షించే కీలక నేత ద్వారా రెండు, మూడు నెలల నుంచి విశ్వప్రయత్నం చేస్తున్నారు.

నేటి నుంచి ఐపీఎల్ మ్యాచ్‌ల టికెట్ల అమ్మకం

... 5వ పేజీ తరువాయి

చేపట్టనున్నట్టు ఢిల్లీ క్యాపిటల్స్ యాజమాన్యం తెలిపింది. ఈనెల 31న ఢిల్లీ క్యాపిటల్స్-చెన్నై సూపర్‌కింగ్స్ జట్ల మధ్య జరిగే మ్యాచ్‌కు టికెట్ల అమ్మకాలు ఈనెల 27 నుంచి జరుగుతాయని పేర్కొంది. టికెట్ల ధరలను రూ.1,000, రూ.1500, రూ. 2000, రూ.3,000, రూ.3,500, రూ.5,000, రూ.7,500గా నిర్ణయించింది. కాగా, ఆన్‌లైన్ టికెట్లను మామూలు టికెట్లుగా మార్చుకునేందుకు నగరంలోని స్వర్ణభారతి ఇండోర్ స్టేడియం, ఏసీఏ-వీడీసీఏ 'బి' గ్రౌండ్‌లో కేంద్రాలను ఏర్పాటుచేస్తున్నారు. ఢిల్లీ క్యాపిటల్స్-కోల్‌కతా నైట్‌రైడర్స్ మధ్య జరిగే మ్యాచ్ టికెట్లు కొనుగోలు చేసినవారు ఈనెల 26 నుంచి, ఢిల్లీ క్యాపిటల్స్-చెన్నై సూపర్‌కింగ్స్ మ్యాచ్‌కు ఆన్‌లైన్ టికెట్ పొందిన వారు ఈనెల 27 నుంచి ఆయా కేంద్రాల్లో మార్చుకోవాలని స్పష్టం చేశారు. కాగా టికెట్ల ధరలు క్రీడాభిమానులలో నిరుత్సాహాన్ని కలిగిస్తున్నాయి. ప్రారంభ టికెట్ ధర రూ.1000 కావడంతో ఆలోచనలో పడుతున్నారు.

స్కానర్ ఉన్నా... ప్రయోజనం సున్నా!

... 5వ పేజీ తరువాయి

వివరాలు ఏమీ దీని ద్వారా తెలియవు. ఇప్పుడు బ్రెజిల్ నుంచి వచ్చిన డ్రై ఈస్ట్ కంటెయినర్‌నే దీంతో స్కానింగ్ చేయిస్తే...అందులో వేయి బ్యాగులు, వాటిలో గ్రాన్యువల్స్ రూపంలో ఉన్న డ్రై ఈస్ట్ ఎక్స్‌రే ఫిల్మ్‌లా కనిపిస్తుంది. అంతే తప్ప అందులో డ్రగ్స్ కలిసి ఉన్నట్టు పసిగట్టలేదు. బంగారం, ఎర్రచందనం వంటివి కూడా ఈ స్కానర్ గుర్తించలేదు. లోపల ఉన్నది లోహం అని, దాని రూపు ఎలా ఉందనేది చెప్పగలుగుతుందే తప్ప అది బంగారమా, ఇత్తడా? అనేది వెల్లడించలేదు. అలాగే ఎర్రచందనమా, టేకు దుంగలా, సాధారణ వేపదుంగలా అనేది కూడా తెలియదు. కంటెయినర్‌లో ఉన్న సరకు ద్రవపదార్థమా, ఘన పదార్థమా? సెమీ ఘన పదార్థమా (ముద్ద)? అనేది మాత్రమేగుర్తించగలుగుతుంది. మొబైల్ ఎక్స్‌రే స్కానర్‌తో తనిఖీలు చేసి అక్రమ రవాణా నిరోధిస్తున్నామని చెప్పడం అవాస్తవాలను ప్రచారం చేయడం కిందకే వస్తుంది.కంటెయినర్లలో నిషేధ వస్తువులు రాకుండా ఉండాలంటే ఇంకాపటిష్టమైన వ్యవస్థఅవసరం.కస్టమ్స్ అధికారుల ప్రత్యక్ష తనిఖీలు పెంచడం,వారికి అవసరమైన సిబ్బందిని,వసతులు సమకూర్చడం కేంద్ర ప్రభుత్వ బాధ్యత.

మేహాద్రిగెడ్డ కాలువపై ఎందుకంత నిర్లక్ష్యం!

» ఏళ్లు గడుస్తున్నా కానరాని అభివృద్ధి పనులు
» పూడికతో నానాటికీ దుర్భరంగా మారుతున్న కాలువ
» రిజర్వాయర్ గేట్లు ఎత్తితే లోతట్టు ప్రాంతాల ప్రజలకు తప్పని తిప్పలు
» పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు

గోపాలపట్నం, మార్చి 23: నగరవాసుల దాహార్తిని తీర్చడంలో కీలక పాత్ర పోషిస్తున్న మేహాద్రిగెడ్డ రిజర్వాయర్ అభివృద్ధి పనులపై అధికారులు దృష్టిసారించడం లేదు. రిజార్వయర్ నిర్మాణం చేపట్టి దశాబ్దాలు గడుస్తున్నా జలాశయం సమస్యలను పరిష్కరించడంపై ప్రజాప్రతినిధులు గానీ అధికారులు కానీ శ్రద్ధ చూపకపోవడంతో రిజర్వాయర్ పరిస్థితి నానాటికీ దిగజారుతుండడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు.

నిర్లక్ష్యపు నీడలో..

మేహాద్రిగెడ్డ రిజర్వాయర్ నిర్మాణం చేపట్టిన సమయంలో పారిశ్రామిక, వ్యవసాయ అవసరాలను దృష్టిలో పెట్టుకుని పనులు చేపట్టారు. అయితే ప్రస్తుతం ఈ రిజర్వాయర్ నీటిని పూర్తిగా తాగునీటి అవసరాల కోసమే జీవీఎంసీ అధికారులు వినియోగిస్తున్నారు. రిజర్వాయర్ నిర్వహణకు కావలసిన నిధులను జీవీఎంసీ సమకూరిస్తే.. ఇరిగేషన్ శాఖ జలాశయం నిర్వాహణ పనులను చూస్తుంది. ఇంత వరకూ బాగానే ఉన్నా రిజర్వాయర్ సమస్యల పరిష్కారం గురించి ఇటు జీవీఎంసీ గానీ అటు ఇరిగేషన్ శాఖ కానీ స్పందించకపోవడంతో జనాలకు ఇబ్బందులు తప్పడం లేదు.

ముఖ్యంగా రిజర్వాయర్ వరద నీరు సముద్రంలోకి వెళ్లేలా ప్రధాన కాలువ నిర్మాణం ఇప్పటికీ చేపట్టలేదు. సుమారు ఐదు కిలోమీటర్ల పొడవున ఉన్న ఈ కాలువ నిర్మాణం జరగకపోవడంతో ప్రస్తుతం ఈ కాలువ పూడికతో నిండిపోయి భూమికి సమాంతరంగా మారింది. దీంతో భారీ వర్షాలు కురిసి రిజర్వాయర్ గేట్లు తెరిస్తే లోతట్టు ప్రాంతాలు జలమయమై పలు గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యే పరిస్థితులు నెలకొన్నాయి.

కాలువ నిర్మాణం చేపట్టకపోతే ఇబ్బందే..

మేహాద్రిగెడ్డ రిజర్వాయర్ నుంచి వరదనీరు విడిచి పెట్టే సమయంలో విశాఖ విమానాశ్రయం నీట మునిగి విమానాలు నడవలేని పరిస్థితి గతంలో ఉండేది. దీంతో కొన్నేళ్ల క్రితం షీలానగర్ సమీపంలో కాలువ నిర్మాణం చేపట్టడంతో విమానాశ్రయానికి వరద ముప్పు తప్పినా లోతట్టు ప్రాంతాలను మాత్రం వీడలేదు. ముఖ్యంగా రిజర్వాయర్ కాలువకు ఆధునీకరణ పనులు చేపట్టకపోతే షీలానగర్, జగ్గయ్యపాలెం, కొత్తపాలెం శివారుతో పాటు ఎల్లపువానిపాలెం, భగత్‌సింగ్ నగర్ ప్రాంతాలు నీట మునుగుతున్నాయి. దీనిని దృష్టిలో పెట్టుకుని రిజర్వాయర్ కాలువను ఆధునీకరించడానికి చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



పైన కనిపిస్తున్న ఫొటో సుందర దృశ్యం ఏమీ కాదు.. పూడికలతో దుర్భరంగా మారిన మేహాద్రిగెడ్డ రిజర్వాయర్ కాలువ



గేట్లు ఎత్తే సమయంలో రిజర్వాయర్ కాలువ (ఫైల్ ఫొటో)



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ వి.శ్రీనివాసరావు

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

స్టీల్‌ప్లాంట్ సీఐ వి.శ్రీనివాసరావు

ఉక్కుటౌన్‌షిప్, మార్చి 23: సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని, సైబర్ మోసగాళ్ల వలలో ఎవరూ పడవద్దని స్టీల్‌ప్లాంట్ సీఐ వి.శ్రీనివాసరావు సూచించారు. స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లో శనివారం యువతకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల అవసరాలను సైబర్ నేరగాళ్లు అలుసుగా తీసుకుని మోసం చేస్తున్నారన్నారు. బ్యాంకుల నుంచి ఎవరూ ఫోన్ చేసి వివరాలు అడగరని, తెలియని వెబ్‌సైట్లలో నగదు చెల్లింపులు చేపట్టరాదన్నారు. ఎవరైనా అనుమానంగా సంచరిస్తే తక్షణమే సమీపంలోని పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

కార్పొరేట్ సంస్థల అభివృద్ధే కేంద్ర ప్రభుత్వ ధ్యేయం

ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ ఆదినారాయణ



దీక్షా శిబిరంలో ఆదినారాయణ, తదితరులు

కూర్మన్నపాలెం, మార్చి 23: ప్రజల మనోభావాలను, ఎన్నికల వాగ్దానాలను, లెక్క చేయకుండా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పాలన సాగిస్తుందని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ విమర్శించారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిరసిస్తూ కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శనివారం నాటికి 1,136వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేట్ శక్తుల అభివద్ధే ధ్యేయంగా కేంద్రం పని చేస్తుందని మండిపడ్డారు. కమిటీ నాయకుడు యు.రామస్వామి మాట్లాడుతూ రూ.లక్షల కోట్లను ప్రజల వద్ద నుంచి పన్నుల రూపంలో వసూలు చేస్తూ దానిని దేశాభివృద్ధికి వినియోగించకుండా కార్పొరేట్ శక్తులకు రాయితీల రూపంలో అందజేస్తున్న ప్రభుత్వాలకు తగిన సమయంలో బుద్ధి చెబుతామన్నారు. నాయకుడు వరసాల.శ్రీనివాసరావు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ప్రభుత్వ రంగాలను ప్రశ్నార్థకంగా మారుస్తూ దుర్మార్గ పాలన సాగిస్తున్న కేంద్రానికి నూకలు చెల్లే సమయం ఆసన్నమైందన్నారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

31లోగా పన్ను చెల్లిస్తే వడ్డీ మాఫీ

గాజువాక, మార్చి 23: గాజువాక జోనల్ పరిధిలో అసెస్‌మెంట్‌దారులు తమ ఆస్తి పన్నును తక్షణమే చెల్లించాలని జోనల్ కమిషనర్ సన్యాసినాయుడు కోరారు. ఈ నెల 31వ తేదీలోగా బకాయిలు లేకుండా చెల్లిస్తే ఆస్తి పన్నుపై వడ్డీ మాఫీ జరుగుతుందన్నారు. అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఎన్నికల కాల్ సెంటర్ ఏర్పాటు

పెందుర్తి, మార్చి 23: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పెందుర్తి అసెంబ్లీ, అనకాపల్లి పార్లమెంటు నియోజకవర్గాలకు సంబంధించి పెందుర్తి తహసీల్దార్ కార్యాలయంలో 24 గంటలు పనిచేసేలా కాల్ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్టు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి శేషశైలజ తెలిపారు. ప్రజలంతా తమ సందేహాలు, ఇప్పటికే సూచనలు, అత్యవసర అంశాలకు సంబంధించి 9063783289, 0891-2954161 ఫోన్ నంబర్లను సంప్రదించాలని కోరారు.

బీటెక్ విద్యార్థులకు వీడ్కోలు

అగనంపూడి, మార్చి 23: ఇక్కడి గొన్నవానిపాలెంలోని గొన్నా ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం బీటెక్ విద్యార్థులకు ఘనంగా వీడ్కోలు పలికారు. కళాశాల కార్యదర్శి గొన్నా హేమచంద్‌నాయుడు జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించి మాట్లాడారు. ఇంజనీరింగ్ పూర్తి చేసిన విద్యార్థులంతా భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పీఎస్ఎన్ మూర్తి, అధ్యాపక సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

స్థలం కేటాయించాలని వినతి

అగనంపూడి, మార్చి 23: అగనంపూడిలో విద్యుత్ సబ్ స్టేషన్ ఏర్పాటుకు స్థలం కేటాయించాలని కోరుతూ స్థానిక అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో శనివారం గాజువాక తహసీల్దార్ శ్రీవల్లికి వినతిపత్రం అందజేశారు. అగనంపూడి పరిసర ప్రాంతాల్లో 16 గ్రామాలు ఉన్నాయని, సుమారు 40 వేల జనాభా ఉంటున్నారని పేర్కొన్నారు. ఈ ప్రాంతంలో లో వోల్టేజీ సమస్య అధికంగా ఉందని, ఈ విషయాన్ని ఈపీడీసీఎల్ అధికారుల దృష్టికి తీసుకువెళితే సబ్ స్టేషన్ ఏర్పాటు చేస్తామన్నారని వివరించారు. అందుకు గాను స్థలం కేటాయిస్తే సమస్య పరిష్కారమవుతుందని తహసీల్దార్‌కు తెలిపారు. కార్యక్రమంలో కమిటీ పెద్దలు బలిరెడ్డి సత్యనారాయణ, కసిపల్లి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దించాలి: టీడీపీ జిల్లా అధ్యక్షుడు 'పల్లా'

అగనంపూడి, మార్చి 23: రాష్ట్రంలో అరాచక పాలన సాగిస్తున్న వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు అందరూ కృషి చేయాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు, గాజువాక నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి పల్లా శ్రీనివాసరావు కోరారు. 85వ వార్డుకు చెందిన టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులతో శనివారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో జరగనున్న ఎన్నికల్లో తనను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్, నాయకులు దాసరి త్రినాథ్, కర్రి దోశేంద్ర, గంతకోరు అప్పారావు, ఎం.వెంకటరమణ, సాంబశివరావు, కె.శ్రీను, తాతారావు, పెంటారావు, తదితరులు పాల్గొన్నారు.



జనసేన, బీజేపీ నాయకులతో పల్లా శ్రీనివాసరావు

'బండారు'కు టికెట్ ఇవ్వాలంటూ కొవ్వొత్తుల ప్రదర్శన



కొవ్వొత్తుల ప్రదర్శన పాల్గొన్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు

పెందుర్తి, మార్చి 23: పెందుర్తి నియోజవర్గం టీడీపీ అభ్యర్థిగా మాజీ మంత్రి, సీనియర్ నేత బండారు సత్యనారాయణమూర్తి పేరును అధిష్ఠానం ప్రకటించాలని డిమాండ్ చేస్తూ శనివారం రాత్రి ఆ పార్టీ శ్రేణులు కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శన చేపట్టారు. ఉత్తరాంధ్రలో టీడీపీకి పెద్దదిక్కుగా నిలిచి పార్టీ కోసం శ్రమించి ఎన్నో పోలీసు కేసులకు ఎదురొడ్డి నిలిచిన బండారుకు టికెట్ ఇవ్వకపోవడం శోచనీయమంటూ నినాదాలు చేశారు. టీడీపీకి కంచుకోటగా పెందుర్తిని మార్చిన బండారును కాదని పొత్తు దృష్ట్యా జనసేన అభ్యర్థికి టికెట్ ఇవ్వడం భావ్యం కాదని, దీనిపై అధిష్ఠానం పునరాలోచన చేయాలన్నారు. బండారుకు టికెట్ ఇవ్వకపోతే తామంతా పార్టీకి రాజీనామా చేసేందుకు కూడా సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు కరక దేవుడు, 96వ వార్డు అధ్యక్షుడు వేగి పరమేశ్వరరావు, నాయకులు దాట్ల మధు, ఎం.రవిసుందర్, శ్రీను యాదవ్, కె.సుందరరావు, జి.రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యం పట్ల అందరూ శ్రద్ధ చూపాలి: ఉక్కు సీజీఎం

ఉక్కుటౌన్‌షిప్, మార్చి 23: ప్రతిఒక్కరూ ఆరోగ్యంపై పూర్తి శ్రద్ధ చూపాలని స్టీల్‌ప్లాంట్ సీజీఎం (మెడికల్) కేహెచ్ ప్రకాశ్ అన్నారు. జేసీఐ వైజాగ్ స్టీల్ సిటీ, లీ హెల్త్ డొమైన్, లీ ఫార్మా లిమిటెడ్ ఆధ్వర్యంలో శనివారం స్టీల్‌ప్లాంట్ జనరల్ ఆస్పత్రిలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో అందరికీ ఆరోగ్యం చాలా ముఖ్యమన్నారు. మోకాళ్లు, భుజం, నడుము, కీళ్ల నొప్పులకు సంబంధించి సుమారు ఐదు వందల మందికి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. లీ ఫార్మా లిమిటెడ్ డైరెక్టర్ ఆళ్ల లీలారాణి మాట్లాడుతూ స్మూత్ వాక్ పేరుతో ఈ శిబిరం నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో జేసీఐ ప్రెసిడెంట్ ధనుంజయ్, పలువురు వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



వైద్య శిబిరంలో పాల్గొన్న సీజీఎం ప్రకాశ్, తదితరులు

'వైసీపీ విజయానికి కృషి చేయాలి'

అక్కిరెడ్డిపాలెం, మార్చి 23: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించి త్వరలో జరగనున్న ఎన్నికల్లో వైసీపీ మళ్లీ విజయం సాధించేందుకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని మంత్రి గుడివాడ అమర్‌నాథ్ కోరారు. అక్కిరెడ్డిపాలెంలో శనివారం కార్పొరేటర్ గుడివాడ అనూష ఆధ్వర్యంలో జరిగిన 68వ వార్డు వైసీపీ కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సమావేశంలో ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, వైసీపీ నాయకులు గుడివాడ లతీశ్, సంగ్రాన నూకరాజు, వి.రమణ, బి.జోసఫ్, శ్రీహరి, తదితరులు పాల్గొన్నారు.

భగత్‌సింగ్‌కు నివాళి



భగత్‌సింగ్ చిత్రపటం వద్ద నివాదాలు చేస్తున్న సీపీఐ నాయకులు

సింధియా, మార్చి 23: భగత్‌సింగ్ 93వ వర్ధంతిని 63వ వార్డు కాకరలోవలో శనివారం నిర్వహించారు. భగత్‌సింగ్ చిత్రపటానికి సీపీఐ నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు గుడాల రాంబాబు మాట్లాడుతూ విప్లవ ధర్మాల కోసం అతిచిన్న వయసులో ప్రాణాలను తృణప్రాయంగా విడిచిపెట్టిన మహనీయుడు భగత్‌సింగ్ అని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు త్రినాథ్, రామకృష్ణ, కనకేశ్వరరావు, సురేశ్, కామేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ పథకాలపై టీడీపీ ప్రచారం

పెదగంట్యాడ, మార్చి 23: తెలుగుదేశం పార్టీ మేనిఫెస్టోలో ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని టీడీపీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి పెద్దాడ సోమునాయుడు కార్యకర్తలను కోరారు. టీడీపీ మండల ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో శనివారం సీతానగరం ఎస్సీ కాలనీలో సూపర్ సిక్స్ పథకాలపై ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద, దళిత వర్గాలకు మేలు చేకూరాలంటే టీడీపీ అధికారంలోకి రావాలన్నారు. కార్యక్రమంలో నాయకులు టేకేటి అప్పారావు, జి.కోటేశ్వరి, పి.సరోజని, కె.సన్యాసమ్మ, జి.పోలయ్య, గంగునాయుడు, పి.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



చిత్రలేఖనం పోటీలలో పాల్గొన్న విద్యార్థులు

అయ్యప్ప స్వామి జన్మదిన వేడుకలు ప్రారంభం

విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు

అక్కిరెడ్డిపాలెం, మార్చి 23: షీలానగర్‌లోని అయ్యప్ప స్వామి ఆలయంలో శనివారం స్వామివారి జన్మదిన వేడుకలు వైభవంగా ప్రారంభమయ్యాయి. మణికంఠ జ్యోతి భక్తసేవా సంఘం ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించే ఈ వేడుకల్లో భాగంగా శనివారం వేదపండితులు అయ్యప్పను పంచామృతాలతో అభిషేకించాక ప్రత్యేక పూజలు చేశారు. వేడుకల సందర్భంగా నిర్వహించిన చిత్రలేఖనం పోటీల్లో మింది, అక్కిరెడ్డిపాలెం హైస్కూల్ విద్యార్థులతో పాటు శబరి విద్యానికేతన్ విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు ఎస్ఆర్ వైద్యనాథన్, సీహెచ్ నాగార్జున, నంబారు రాజు, ఎస్.విశ్వేశ్వరరావు, ఎం.శ్రీనివాసరావు, రవిచంద్, భద్రాచలం, తదితరులు పాల్గొన్నారు.

పైడిమాంబకు ప్రత్యేక పూజలు

గాజువాక, మార్చి 21: నడుపూరు ప్రజల ఆరాధ్య దేవత పైడిమాంబ పండుగలో భాగంగా శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ నెల 26న అమ్మవారి అనుపోత్సవాన్ని వైభవంగా నిర్వహిస్తామకి ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. అమ్మవారిని పీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి జెర్రిపోతుల ముత్యాలు, తదితరులు దర్శించుకున్నారు.

31న త్రిమాత ఆలయ వార్షికోత్సవం

పెందుర్తి-రూరల్, మార్చి 23: మండలంలోని చింతలఅగ్రహారం, గవరపాలెం, దుర్గానగర్, లక్ష్మీపురం గ్రామాల ప్రజల ఆరాధ్య దేవతలు బండిమాంబ, మెట్టమాంబ, దుర్గమాంబ (త్రిమాత)ల ఆలమ వార్షికోత్సవాన్ని ఈ నెల 31న వైభవంగా నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ చైర్మన్ మద్దాల శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు పటిష్ఠ ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఆ రోజున అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేయడంతో పాటు ఊరేగింపు నిర్వహిస్తామన్నారు. అలాగే మధ్యాహ్నం అన్న సమారాధనను చేపడతామని పేర్కొన్నారు.

'అభివృద్ధి, సంక్షేమాన్ని వివరించాలి'

పెందుర్తి, మార్చి 23: సుజాతనగర్‌లోని తమ క్యాంప్ కార్యాలయంలో శనివారం ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ఆధ్వర్యంలో పెందుర్తి నియోజకవర్గ వైసీపీ ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో జరగనున్న ఎన్నికలకు సంబంధించి ప్రచారం, పోలింగ్ వంటి అంశాలపై నాయకులకు దిశానిర్దేశం చేశారు. వైసీపీ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించాలని సూచించారు. ఈ సమావేశంలో కార్పొరేటర్ ముమ్మన దేవుడు, నాయకులు ఉప్పిలి కనకరాజు, దాడి ఉమామహేశ్వరరావు, గొరపల్లి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

నవగ్రహాలకు ప్రత్యేక పూజలు



నవగ్రహాల హోమంలో పాల్గొన్న భక్తులు

కూర్మన్నపాలెం, మార్చి 23: ఇక్కడి సంపత్ వినాయక ఆలయ ప్రాంగణంలో శనివారం త్రయోదశిని పురస్కరించుకుని ప్రధాన అర్చకులు శివాజీశర్మ ఆధ్వర్యంలో నవగ్రహాలకు హోమాలు, అష్టోత్తర శతనామావళితో సామూహిక పూజలు నిర్వహించారు. నవగ్రహాలకు తైలాభిషేకాలు చేశారు. ఇలా చేయడం వల్ల ఏలినాటి శని, అష్టమ శని, అర్ధాష్టమ శని, ఈతిబాధలు తొలగుతాయని అర్చకులు తెలిపారు. ఆయా పూజాది కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వేపగుంట: నాయుడుతోట కృష్ణానగర్‌లోని దుర్గామల్లేశ్వరాలయంలో ఉన్న నవగ్రహాలకు త్రయోదశి పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. పౌర్ణమి ముందు వచ్చే ఈ త్రయోదశి ఎంతో విశిష్టమైనదని, జాతక రీత్యా ఉన్న ఏలినాటి శని, అష్టమ శని, అర్ధాష్టమ శని తొలగిపోవాలంటూ పలువురు భక్తులు ఆలయానికి విచ్చేసి పూజలు చేయించుకున్నారు. వేకువజాము నాలుగు గంటల నుంచే తైలాభిషేకాలు, తదితర పూజల్లో పాల్గొనేందుకు వచ్చిన భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కమిటీ సభ్యులు తగిన ఏర్పాట్లు చేశారు.

కల్యాణ వెంకన్నకు అభిషేకాలు



వజ్రకవచధారణలో కల్యాణ వెంకన్న

వేపగుంట, మార్చి 23: నాయుడుతోటలోని రవినగర్ శేషాద్రి కొండపై ఉన్న కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ఉదయం శ్రీవారికి ప్రత్యేక అభిషేకాలు, తులసీపూజ చేసి చెన్నై నుంచి తెప్పించిన పుష్పాలతో అర్చన చేశారు. స్వామివారిని వజ్రకవచంతో అలంకరించగా, అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. సాయంత్రం సామూహిక విష్ణుసహస్రనామ పారాయణం చేశారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

పెందుర్తి: ఇక్కడి వెంకటాద్రి శిఖరంపై ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చలు చేశారు. ఆలయ ప్రాంగణంలో నిర్వహిస్తున్న లక్ష్మీదేవి అమ్మవారి ఉత్సవాల్లో భాగంగా లక్ష్మీ శ్రీసూక్త పారాయణం, కుంకుమ పూజలు, దీపోత్సవం చేపట్టారు.

సీఐటీయూ కార్యాలయంలో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌పై సెమినార్

ఉక్కుటౌన్‌షిప్, మార్చి 23: స్టీల్‌ప్లాంట్ సీఐటీయూ కార్యాలయంలో ట్రూపర్ క్రాట్ సంస్థ ఆధ్వర్యంలో శనివారం ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌పై సెమినార్ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన స్టీల్‌ప్లాంట్ ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ అధ్యక్షుడు బొండ తౌడన్న మాట్లాడుతూ యువతకు ఉపాధి కల్పించేందుకు ఇటువంటి సెమినార్లు నిర్వహించడం అభినందనీయమన్నారు. అందుబాటులో ఉన్న వనరులను యువతీయువకులు సద్వినియోగం చేసుకోవాలని, మారుతున్న మార్పులకు అనుగుణంగా ఆర్టిఫీషియల్ ఇంటెలిజన్స్ ఎంతో ఉపయోగకరంగా మారిందన్నారు. ఫైనాన్సియల్ ఎక్స్‌పర్ట్ చేతన్, చీఫ్ టెక్నికల్ ఆఫీసర్ ఈశ్వర్ చంద్ర పలు అంశాల గురించి వివరించారు. కార్యక్రమంలో నిర్వాహకులు విజయ్, ఆకాంక్ష, ప్రశాంత్, నారాయణ, ఎ.రవికుమార్, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **ఓం భీం బుష్ :** మెలోడి, సంగం, కామేశ్వరి, శారద, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), లిఖిత (శ్రీహరిపురం), శ్రీకన్య-2 (గాజువాక), దుర్గ (మధురవాడ), సీతారామయ్య (పరవాడ), అరుణ (పెదగంట్యాడ), తాతా (తగరపువలస)
- **భీమా :** రమాదేవి, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), శ్రీనరసింహ (గోపాలపట్నం), హెవెన్ (గాజువాక), రాములమ్మ (తగరపువలస)
- **లైన్ మ్యాన్ :** లీలామహల్, మోహిని కాంప్లెక్స్ (గాజువాక)
- **యమధీర :** మౌర్య (గోపాలపట్నం)
- **గామి :** జగదాంబ, లక్ష్మీకాంత్ (గాజువాక)
- **ప్రేమలు :** శ్రీవెంకటేశ్వర, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), లక్ష్మి (గాజువాక), నటరాజ్ (పెందుర్తి), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సప్తగిరి (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 23, టమాటా 16, వంకాయలు (తెలుపు) 22, వంకాయలు (నలుపు) 22, బెండకాయలు 24, పచ్చిమిర్చి 46, కాకరకాయలు 28, బీరకాయలు 38, ఆనపకాయ 12, కాలీఫ్లవర్ 20, క్యాబేజీ 18, క్యారెట్ 30, దొండకాయలు 22, బంగాళదుంపలు 21, అరటికాయ (పెద్దది) 7, అల్లం (పాతది) 144, మునక్కాడలు (కిలో) 38, బరబాటి 18, ముల్లంగి 16, నిమ్మకాయలు (కిలో) 90, గోరుచిక్కుడు 34, దోసకాయలు 20, వెల్లుల్లి (పెద్దవి) 144, కొబ్బరికాయ (పెద్దది) 22, బీన్స్ (పెన్సిల్) 50, ఆగాకర 52, పొటల్స్ 76, కీర దోస 24, క్యాప్సికమ్ 56, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 50, చిలగడదుంపలు 30, కంద 60, దేముడుచిక్కుడు 54, కొండఉసిరి 65, కరివేపాకు (కిలో) 50, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 55, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 35.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)	
విశాఖపట్నం	415
విజయనగరం	419
శ్రీకాకుళం	419

చికెన్ ధరలు

బ్యాగ్		
రైతు ధర	--	102
ఫారం ధర	--	122
విత్ స్కిన్	--	214
స్కిన్‌లెస్	--	224

మరికొన్ని సిటీ వార్తలు పేజీ Iలో..

కొవిడ్ తర్వాత పెరిగిన గుండె సంబంధిత వ్యాధులు

» కెనడాకు చెందిన ప్రముఖ కార్డియాలజిస్టు మామ్స్‌మామ్స్



సదస్సులో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న వైద్య నిపుణులు

మహారాణిపేట, మార్చి 23: కొవిడ్ అనంతరం జనాల్లో గుండె సంబంధిత వ్యాధులు పెరిగినట్టు కెనడాకు చెందిన ప్రముఖ కార్డియాలజిస్టు మామ్స్‌మామ్స్ అన్నారు. నగరంలో తొలిసారిగా 16వ ఉమెన్ కార్డియక్ కేర్- 2024 పేరిట సదస్సు శనివారం హోటల్ నోవాటెల్‌లో ప్రారంభమైంది. ఈ సదస్సుకు విదేశాలకు చెందిన హృద్రోగ నిపుణులు హాజరయ్యారు. విదేశాలను నుంచి వైద్య నిపుణులు ప్రత్యక్ష ప్రసారాల ద్వారా శస్త్ర చికిత్సలు చేసి చూపి వాటిని విశ్లేషించారు. అనంతరం కెనడాకి చెందిన మామ్స్‌మామ్స్ మాట్లాడుతూ కొవిడ్ తర్వాత హృద్రోగాలపై ప్రజల్లో అవగాహన పెరిగిందన్నారు. ప్రతీ ఒక్కరూ వ్యాయామం, ఆహార నియమాలపై శ్రద్ధ వహిం చటం ద్వారానే మెరుగైన ఆరోగ్యం సాధ్యమన్నారు. ప్రధానంగా మహిళలు హృద్రోగాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. అంతర్జాతీయ వైద్య నిపుణులు కార్డియో వ్యాస్క్యులర్ మెడిసిన్, శస్త్ర చికిత్సలు, పరిశోధనలపై చర్చించారు. నూతన చికిత్సా విధానాలను వివరించారు. రెండు రోజులపాటు జరిగే ఈ సదస్సుకు జపాన్, బ్రిటన్, కెనడా, సౌదీ, అరేబియా తదితర దేశవిదేశాల నుంచి సుమారు 400 మందికిపైగా వైద్య నిపుణులు హాజరయ్యారు. నటాలియో పినాలీ, మిరావట్ అలాసాంగ్, వి. రమాబాలా, వి. సుజాత తదితర వైద్యులు పాల్గొన్నారు.

అమూల్ దుకాణాలు ధమాల్

» గెడ్డలు, కాలువలు, బస్టాప్ ఆక్రమిత స్థలాల్లో ఏర్పాటు

» పాల వ్యాపారంపై ఆసక్తి చూపని యువత

» అనేక చోట్ల నిరుపయోగంగా ఐరన్ బడ్డీలు

మురళీనగర్, మార్చి 23; ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా తీసుకున్న అమూల్ పాల ఉత్పత్తి విక్రయదుకాణాలకు నగరంలో పెద్దగా స్పందన కానరావడంలేదు. రహదారుల ఆక్రమించి మరీ ఏర్పాటుచేసిన ఈ దుకాణాలు నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. ఏడాది కిందట జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ విభాగం పర్యవేక్షణలోనే అమూల్ సంస్థ వ్యాపారాభివృద్ధిలో భాగంగా వీటిని అనేకచోట్ల కాలువలు, గెడ్డల పక్కన, బస్టాప్‌లను సైతం ఆక్రమించి మరీ ఏర్పాటుచేశారు. యువ పారిశ్రామిక వేత్తలను తయారు చేద్దాం అనే బృహత్తర ప్రణాళికలో భాగంగా వీటిని నెలకొల్పారు. కానీ, విశాఖ ఉత్తర నియోజకవర్గంలో యువత ఎవరూ ఈ వ్యాపార అవకాశాన్ని అందిపుచ్చుకోవడానికి ముందుకు రాలేదు. జీవీఎంసీ ప్రాంతాన్ని బట్టి రూ.లక్షకు పైగా డిపాజిట్ చేసి, తిరిగి నెలకు అద్దె వసూలుపై ఈ అమూల్ పాల దుకాణాలు ఏర్పాటుచేయాలన్న నిబంధనలతో యువతనుంచి స్పందన కరువైంది. దీంతో బడ్డీలు అలాగే మిగిలిపోతున్నాయి. తెరవకుండానే ఇనుప దుకాణాలు తుప్పు పట్టిపోతున్నాయి. చెత్తా చెదారాల మధ్య 51వ వార్డు మాధవధార రోడ్డులో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సమీపాన, అం



మాధవధార రోడ్డులో చెత్తకుప్పల మధ్య అమూల్ బడ్డీ

బేడ్కర్ కాలనీ వద్ద ఏర్పాటుచేసిన ఈ దుకాణాలు వృథాగా దర్శనమిస్తున్నారు. ఇలా ప్రతి వార్డులో ఏదో ఒకచోట ఈ దుకాణాలు ఖాళీగా ఉంటున్నాయి. 2022 మార్చిలో ఆర్టీఓ ఆఫీసు రోడ్డుకి ఇరువైపులా ఏళ్ల తరబడి ఉన్న ప్రైవేట్ దుకాణాలను జీ-20 సదస్సుల పేరిట తొలగించారు. అనంతరం వ్యాపారులు అనేక నిరసనల తర్వాత వేరే చోట పెట్టుకునేందుకు అనుమతి ఇచ్చారు. మరోవైపు అవే వార్డులో రోడ్లకు ఇరువైపులా అమూల్ దుకాణాలు ఎవరు తీసుకోకుండా తుప్పు పట్టి పోతున్నా జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ పట్టించుకోకపోవడంతో ఇతర వ్యాపారులు తీవ్ర అసహనం వ్యక్తంచేస్తున్నారు.

స్వాతంత్రోద్యమంలో భగత్‌సింగ్‌ది ప్రత్యేక చరిత్ర



భగత్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సిట నాయకులు

పూర్ణామార్కెట్, మార్చి 23: భారతదేశ స్వాతంత్ర్య పోరాటంలో భగత్‌సింగ్‌ది ప్రత్యేక చరిత్ర అని సీఐటీయూ నాయకులు ఎం.సుబ్బారావు, వై.రాజు అన్నారు. శనివారం భగత్ సింగ్ వర్ధంతిని పురస్కరించుకుని పూర్ణామార్కెట్, కొత్తరోడ్డు వద్ద ముఠా కార్మికులతో కలసి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, స్వాతంత్ర్య పోరాటంలో బ్రిటీష్ పాలకులకు భగత్‌సింగ్ సింహస్వప్నంగానిలిచారన్నారు. భారతమాత కోసం ప్రాణాలను త్యాగం చేసిన మహానుభావుడిగా వినుతికెక్కారన్నారు. అటువంటి యోధుడిని ఆదర్శంగా తీసుకుని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. నాటి బ్రిటీష్ పాలకులకు నేటి పాలకులకు తేడా లేదని విమర్శించారు. భగత్ సింగ్ విప్లవ స్ఫూర్తితో కార్మికులు ముందుకు సాగాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు చంద్రమౌళి, కార్మికులు పాల్గొన్నారు.

అభయ ఆంజనేయ స్వామికి పూజలు

అక్కయ్యపాలెం, మార్చి 23: గ్రేటర్ 45వ వార్డు తాటిచెట్లపాలెంలోని సుందర అభయ ఆంజనేయ స్వామి ఆలయంలో వార్డు సోషల్ మీడియా ఇన్‌చార్జి మాత ఈశ్వర్ ఆధ్వర్యంలో వేద పండితులు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వైసీపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కేకే రాజు, ఎన్నికల పరిశీలకుడు చొక్కాకుల వెంకటరావు ఆంజనేయ స్వామిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో వార్డు వైసీపీ అధ్యక్షుడు పైడి రమణ, నాయకులు హరి పట్నాయక్, గణపతి, శ్యామ్, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

రైల్వే మాంటిస్సోరి స్కూల్‌లో గ్రాడ్యుయేషన్ డే



వేడుకల్లో విద్యార్థులతో డీఆర్‌ఎం సౌరభ్ ప్రసాద్, మహిళలు

విశాఖపట్నం, మార్చి 23: తూర్పుకోస్తారైల్వే మహిళ సంక్షేమ సంఘం వాల్తేరు డివిజన్ శాఖ నిర్వహిస్తున్న అనురాగ్ మాంటిస్సోరి స్కూల్‌లో శనివారం గ్రాడ్యుయేషన్ దినోత్సవం జరిగింది. న్యూ ఆఫీసర్స్ క్లబ్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి డీఆర్‌ఎం సౌరభ్‌ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై చిన్నారులను అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పిల్లల సమగ్ర అభివృద్ధికి అనుకూల అభ్యాసనా వాతావరణం అవసరమని పేర్కొన్నారు. స్కూల్‌లో సీసీ కెమెరాలు, ఆడియో విజువల్ ఇంటరాక్టీవ్ క్లాసురూమ్ తదితర ఆధునిక సౌకర్యాలు, టీచింగ్ మెథడాలజీలతో అత్యుత్తమంగా స్కూల్‌ను నిర్వహిస్తున్న వాల్తేరు రైల్వే మహిళా సంఘం (ఈకార్వో) ప్రతినిధులు అభినందనీయులని ప్రశంసించారు. ఈకార్వో అధ్యక్షురాలు మంజుశ్రీ ప్రసాద్ మాట్లాడుతూ పిల్లల్లో చదువుతోపాటు సామాజిక అంశాలపై అవగాహన, సానుకూల ఆలోచనలను పెంపొందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏడీఆర్‌ఎంలు సుధీర్‌కుమార్ గుప్తా, మనోజ్‌కుమార్ సాహూ, ఈకార్వో ప్రతినిధులు మధుమిత సాహూ, సంయుక్త తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధిగా కమలాకరరావు

సీతమ్మధార, మార్చి 23: కాంగ్రెస్ పార్టీ విశాఖ జిల్లా అధికార ప్రతినిధిగా ఉత్తరనియోజకవర్గం సీతమ్మధార ప్రాంతానికి చెందిన జీవీఎస్ కమలాకరరావును నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ అవకాశాన్ని కల్పించిన ఏపీసీసీ వైఎస్ షర్మిల రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. ఈ నియామక పత్రాన్ని విశాఖ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడినుంచి ఆయన అందుకున్నారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించండి

» ద్వారకా స్టేషన్ సీఐ రమేశ్

సీతమ్మధార, మార్చి 23: ద్వారకా పోలీసు స్టేషన్ పరిధి సీతంపేట, రెల్లివీధి, హరిజనవీధి, సీతమ్మధార బిలాల్ కాలనీ తదితర ప్రాంతాల్లో సీఐ రమేశ్ ఆధ్వర్యంలో శనివారం బెటాలియన్ సిబ్బంది కవాతు నిర్వహించారు. రానున్న ఎన్నికల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సహకరించాలని ఈసందర్భంగా స్థానికులకు సీఐ సూచించారు. పూర్తి పోలీసు బందోబస్తుతో ఎన్నికల సమయంలో అందుబాటులో ఉంటామన్నారు.



కవాతులో పాల్గొన్న ద్వారకాస్టేషన్ సీఐ రమేశ్, సిబ్బంది

ఎన్ఏడీ జంక్షన్‌లో విస్తృత తనిఖీలు

మర్రిపాలెం: ఎన్నికల నేపథ్యంలో శనివారం విశాఖ జిల్లా ఎస్ఈబీ



ఎన్ఏడీ ప్రాంతంలో డాగ్‌స్క్వాడ్ తనిఖీల్లో ఎస్ఈబీ పోలీసులు

అడిషనల్ ఎస్పీ బి.శ్రీనివాసరావు ఆదేశాలమేరకు అసిస్టెంట్ సూపరిటెండెంట్ యు.సుబ్బారావు ఆధ్వర్యంలో ఎన్ఏడీ జంక్షన్ పరిసర ప్రాంతాల్లో డాగ్ స్క్వాడ్‌తో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. కొరియర్ సర్వీసుకేంద్రాలతోపాటు అనుమానాస్పద ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టినట్టు ఎస్ఈబీ సీఐ ఉపేంద్ర తెలిపారు. ఇంటెలిజెన్స్ ఇన్‌స్పెక్టర్ రాజులునాయుడు,ఎస్ఐలు జి.దాసు, వేణుగోపాల్, సిబ్బంది పాల్గొన్నారు.

సీతంపేట: అపార్టుమెంట్లు, ఇళ్లలోకి అనుమానితులు ఎవరైనా ప్రవేశిస్తే ప్రశ్నించాలని నాలుగో పట్టణ పోలీసు స్టేషన్ ఎస్ఐ వెంకటరావు పేర్కొన్నారు. దొంగతనాలు, సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తూ సమావేశాలను ఏర్పాటు చేశారు. అనుమానాస్పదంగా వ్యక్తులు కనిపిస్తే వెంటనే తమకు సమాచారం ఇవ్వాలని కోరారు.

తుదిదశకు చేరిన వాలీబాల్ టోర్నీ



తలపడుతున్న క్రీడాకారులు

విశాఖపట్నం (స్పోర్ట్సు), మార్చి 23: వాల్తేరు రైల్వే క్రీడా సముదాయంలో జరుగుతున్న నాల్గవ డీఆర్‌ఎం కప్ అఖిల భారత పురుషులు, మహిళల వాలీబాల్ చాంపియన్‌షిప్ టోర్నీ చివరి దశకు చేరింది. శనివారం జరిగిన చివరి లీగ్ మ్యాచ్‌లో ఆతిథ్య తూర్పుకోస్తారైల్వే 25-18, 25-21 (2-0) స్కోరుతో శాప్ హైదరాబాద్‌పై గెలుపొంది సెమీఫైనల్స్‌కు చేరింది. ఇక ప్రకాశం జిల్లా 2-0 స్కోరుతో శాయ్ హాస్టల్ యానంపై, ఈస్ట్ గోదావరి 2-0 స్కోరుతో శ్రీకాకుళంపై, కృష్ణా జట్టు 2-1 స్కోరుతో కిట్స్ యూనివర్సిటీ భువనేశ్వర్‌పై విజయం సాధించి సెమీఫైనల్స్ చేరాయి.

ముగిసిన జాతీయ సదస్సు



సదస్సులో పాల్గొన్న అతిథులు, అధ్యాపకులు

జ్ఞానాపురం, మార్చి 23: స్థానిక సెయింట్ జోసెఫ్ కళాశాలలో సైకాలజీ, కామర్స్, మేనేజ్‌మెంట్ విభాగాల ఆధ్వర్యంలో వ్యాపార నిర్వహణలో అభివృద్ధి చెం దుతున్న పోకడలపై రెండు రోజులపాటు జరిగిన జాతీయ సదస్సు శనివారంతో విజయవంతంగా ముగిసినట్టు ప్రిన్సిపాల్ డా.సిస్టర్ షైజీ తెలిపారు. ముఖ్యఅతిథిగా ఏయూ అకడమిక్ అఫైర్స్ డీన్ ఆచార్య కిశోర్ బాబు, హైదరాబాద్ డా.బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఆచార్య డా. జనార్దనరెడ్డి హజరయ్యారు. ఆచార్య కిశోర్ బాబు మాట్లాడుతూ విద్యార్థులు సంకల్పబలం, క్రమశిక్షణతో నైపుణ్యాలు పెంచుకోవాలన్నారు. ఇలాంటి సదస్సుల్లో పాల్గొనడం ద్వారా మేధస్సుకు మరింత పదను పెట్టుకొనే అవకాశం ఉంటుందన్నారు. ఈ సదస్సులో పాల్గొన్న వారికి ప్రమాణపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో కన్వీనర్ డాక్టర్ డి.రాజ్యలక్ష్మి, సిబిల్ రత్న, డా.హేమ, డా.రజని, డా.హదసా, పావని, ప్రత్యూష, డాక్టర్ అరుణ, డాక్టర్ సుధ, జయలక్ష్మి పాల్గొన్నారు.

సంగీతంలో ఐవీఎల్ శాస్త్రి సేవలు నిరుపమానం

డాబాగార్డెన్స్, మార్చి 23: ప్రముఖ దివంగత ఇంద్రకంటి వెంకటలక్ష్మణశాస్త్రి శాస్త్రీయ సంగీతంలో శిఖరాయమానంగా వెలుగొందారని ఇంద్రగంటి రామచంద్రమూర్తి పేర్కొన్నారు. శనివారం డాబాగార్డెన్స్ ఐవీఎల్ శాస్త్రి సంగీత సమితి కార్యాలయంలో ఐవీఎల్ 97వ జయంతి వేడుకలను నిర్వహించారు. ఐవీఎల్ శాస్త్రి సంగీత సమితికి సంబంధించిన ఉచిత శాస్త్రీయ సంగీత శిక్షణ కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం ఆయన శాస్త్రి సేవలను కొనియాడారు. ఆధ్యాత్మికవేత్త ఎం.వి.రాజశేఖర్ మాట్లాడుతూ విశాఖలో సంగీత జనకులం స్థాపించి తద్వారా వేలాది మందికి శాస్త్రీయ సంగీతాన్ని నేర్పించిన ఘనత ఐవీఎల్‌కే దక్కుతుందన్నారు. ఐవీఎల్ శాస్త్రి సంగీత సమితి సారథ్యంలో ఈ నెల 31న ఉదయం 6 గంటలకు శ్రీరాఘవేంద్రస్వామిమఠంలో ఉచిత శాస్త్రీయ సంగీత శిక్షణకు దరఖాస్తులు, పోటీ పరీక్ష నిర్వహిస్తామన్నారు. వివరాలకు 94407 88809ను సంప్రదించాలన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న దృశ్యం

ఎన్నికల నియమావళి తూచ్..

» యథాతథంగా ఎండీయూ వాహనంపై ప్రచార పోస్టర్లు

కంచరపాలెం, మార్చి 23: ప్రభుత్వ సంక్షేమ పథకాల వివరాలను మూసి వేయకుండా ఉన్న ఈ ఎండీయూ వాహనం కంచరపాలెం రైతుబజార్ సమీపంలోనిది. ఎన్నికల నియమావళి ప్రకారం ఈ ప్రజా పంపిణీ వాహనాలపై ఉన్న సీఎం బొమ్మతో పాటు ప్రభుత్వం అమలుచేసే పథకాల వివరాలను మూసివేయాల్సి ఉన్నా అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. దీనిపై ఫిర్యాదులు వెల్లువెత్తున్నాయి.



కంచరపాలెంలో ప్రజాపంపిణీ వాహనంపై పథకాల వివరాలు

వీడిన మిస్టరీ

-మాజీ ఎమ్మెల్యే ఇంట్లో దోపిడీకి పాల్పడింది ఆయన కుటుంబ గురించి తెలిసిన వ్యక్తే..

విశాఖపట్నం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నేత, మాజీ ఎమ్మెల్యే తైనాల విజయ్‌కుమార్ ఇంట్లో జరిగిన దోపిడీ కేసును పోలీసులు ఛేదించారు. తైనాల కుటుంబం గురించి బాగా తెలిసిన వ్యక్తే నిందితుడని పోలీసులు గుర్తించారు. అతడిని హైదరాబాద్‌లో అదుపులోకి తీసుకుని నగరానికి తీసుకొచ్చి విచారిస్తున్నారు. దీనికి సంబంధించి విశ్వసనీయ సమాచారం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం సమీపంలోని ఒక గ్రామానికి చెందిన యువకుడు కొన్నాళ్ల కిందట డాబాగార్డెన్స్ లలితానగర్‌లోని తైనాల విజయ్‌కుమార్ నివాసానికి వచ్చాడు. తైనాల బంధువుల పేర్లు ప్రస్తావించి వారంతా తన కు తెలిసిన వారేనంటూ మాటలు కలిపాడు. ఇంట్లో తైనాలతోపాటు ఆయన భార్య మాత్రమే ఉంటున్నారని గుర్తించాడు. తైనాల లేని సమయంలో ఇంట్లో దోపిడీ చేస్తే...తన అప్పులు తీరిపోతాయనుకున్నాడు. తన పథకం అమలు చేయడానికి తైనాల దినచర్యపై కొద్దిరోజులుగా నిఘా పెట్టాడు. ఎస్.కోట నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్న తైనాల ఎన్నికల షెడ్యూల్ విడుదలైన తర్వాత ప్రతిరోజూ మధ్యాహ్నం ఇంటి నుంచి బయలుదేరి తిరిగి రాత్రికి చేరుకుంటున్నట్టు గుర్తించాడు. ఈనెల 21న తైనాల ఎస్.కోటలో ఎన్నికల ప్రచారానికి వెళ్లిపోవడంతో రాత్రి ఏడున్నర సమయంలో కత్తి పట్టుకుని ఇంట్లోకి చొరబడ్డాడు. తన ఆనవాళ్లు తెలియకుండా ఉండేందుకు ముఖానికి మాస్క్, నెత్తిన టోపీ ధరించాడు. కిచెన్‌లో వంటచేస్తున్న తైనాల భార్య మెడపై కత్తిపెట్టి తాను చెప్పినట్టు వినకపోతే చంపేస్తానని బెదిరించాడు. బీరువాలోని బంగారం, నగదు తీసి ఇవ్వాలని చెప్పడంతో ఆమె ప్రాణభయంతో అలాగే చేశారు. నిందితుడికి అప్పు ఇచ్చిన వ్యక్తి అదే సమయంలో ఫోన్ చేశాడు. 'ఏడున్నరకు డబ్బు లు తీసుకోవడానికి డాబాగార్డెన్స్‌కు రమ్మన్నావ్. నేను అక్కడే ఉన్నా. నువ్వు ఇంకా రాలేదేమంటూ' ప్రశ్నించాడు. దీనికిసమాధానంగా నిందితుడు...'అదేపనిలో ఉన్నా, వచ్చేస్తున్నా' అంటూ సమాధానం ఇచ్చాడు. తర్వాత బంగారం, నగదుతో ఇంటి నుం చి బయటపడ్డాడు. నడుచుకుంటూ డాబాగార్డెన్స్ రోడ్డులోకి వెళ్లి అక్కడ తాను బాకీ ఉన్న వ్యక్తికి తాను దోపిడీ చేసిన డబ్బులో కొంత ఇచ్చాడు.అక్కడ ఆటో ఎక్కి కాన్వెం ట్ జంక్షన్ మీదుగా ఎన్ఏడీకి చేరుకున్నాడు. అక్కడ బస్సు ఎక్కి రాజమండ్రి వెళ్లి, అక్కడి నుంచి రైలులో హైదరాబాద్ వెళ్లిపోయాడు. అప్పటికే పోలీసులు నిందితుడి ఆచూకీని సీసీ కెమెరాల ఫుటేజీతోపాటు సెల్‌ఫోన్ టవర్ లోకేషన్ ఆధారంగా గుర్తించారు. అతడిని ట్రాకింగ్ చేస్తూ ప్రత్యేక బృందం హైదరాబాద్ వెళ్లి నిందితుడిని అదుపులోకి తీసుకుంది. దోపిడీ చేసిన నగలను కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నట్టు సమాచారం. నిందితుడిని నగరానికి తీసుకొచ్చి పోలీసులు విచారిస్తున్నట్టు తెలిసింది. ఆదివారం పూర్తి వివరాలను మీడియాకు వెల్లడించే అవకాశం ఉంది.

ఎయిడెడ్

... 5వ పేజీ తరువాయి

స్కూళ్లకు బదిలీ చేశారు. ఆయా పాఠశాలలు మూతపడడంతో అక్కడ చదువుకునే పేద విద్యార్థులు చెల్లాచెదురయ్యారు. ఏవీఎన్, సీబీఎం, సెయింట్ ఆంథోనీ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులు సమీపంలోని జీవీఎంసీ పాఠశాలల్లో చేరారు. కూతవేటు దూరంలో ఉన్న స్కూలు నుంచి మూడు నుంచి నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న పాఠశాలలకు పిల్లలు వెళ్లాల్సి రావడంతో అప్పట్లో తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తంచేశారు. ఇంకా జ్ఞానాపురంలో సెయింట్ పీటర్స్ బాయ్స్ స్కూలు మూసివేతతో కంచరపాలెం రామ్మూర్తిపంతులుపేట జీవీఎంసీ పాఠశాలకు, రైల్వే స్టేషన్ ఎదురుగా ఉన్న రైల్వే స్కూలు, మర్రిపాలెంలోని ఎస్ఈ రైల్వే స్కూలు మూతతో నాలుగు కిలోమీటర్ల దూరంలోని గోపాలపట్నం పాఠశాలకు విద్యార్థులు వెళ్లాల్సి వచ్చింది. కొద్దోగొప్పో స్థోమత ఉన్న కుటుంబాలు తమ పిల్లలను ఇంటికి సమీపంలో ఉన్న ప్రైవేటు స్కూళ్లల్లో చేర్పించుకోగా, పేద కుటుంబాలు దూరమైనా గత్యంతరం లేక ప్రభుత్వ పాఠశాలలకు పంపాయి. మరికొందరైతే పిల్లలను చదువు మాన్పించినట్టు ఎయిడెడ్ పాఠశాలలో పనిచేసిన టీచర్ ఒకరు తెలిపారు. ప్రధానంగా బాలికలు చదువుకు దూరమయ్యారని ఆవేదన వ్యక్తంచేశారు. ఇక భీమిలిలో సెయింట్ ఆన్స్ పాఠశాల వచ్చే విద్యా సంవత్సరం నుంచి మూతపడనున్నది. విద్యా రంగ అభివృద్ధికి గడచిన ఐదేళ్లుగా తాము ఎంతో కృషిచేశామని వైసీపీ ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటోంది. కానీ ఎయిడెడ్ విద్యా సంస్థలను విషయంలో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వల్ల వేలాది మంది విద్యార్థులు ఇబ్బందిపడ్డారు. అనేకమంది చదువుకు దూరం అయ్యారు.

ప్రభుత్వ భూములకు ఎసరు!

... 5వ పేజీ తరువాయి

నగర పరిధి, శివారు ప్రాంతాల్లో పట్టా భూములు చేతులు మారినట్టు గతంలో ఫిర్యాదులు రావడంతో రెవెన్యూ అధికారులు విచా రణ చేపట్టారు. ఆనందపురం మండలంలో పలు గ్రామాల్లో భారీఎత్తున అమ్మకాలు జరిగినట్టు విచారణలో తేలడంతో వాటిని రద్దు చేయాలని అప్పటి అధికారులు జిల్లా కలెక్టర్‌కు సిఫారసు చేశారు. ఈ విధంగా రామవరం, భీమన్న దొరపాలెం, కోలవానిపాలెంలో సుమారు 60 ఎకరాల కేటాయింపు రద్దు చేశారు. ఈ నేపథ్యంలో ఆయా భూముల్లో రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డులు పెట్టారు. అయితే రైతుల నుంచి భూములు కొనుగోలు చేసిన వారిలో ఎక్కువగా రాజకీయ నాయకులు, పెద్ద వ్యాపారులు ఉన్నారు. భూములు స్వాధీనం చేసుకోకుండా వారు ఉన్నత స్థాయిలో చక్రంతిప్పారు. ఇదిలావుండగా జగనన్న కాలనీలకు డీ.ఫారం భూములు సేకరించే సమయంలో గతంలో పట్టాలు రద్దు చేసిన వాటి వివరాలకు సంబంధించిన ఫైలును మాయం చేశారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. తాజాగా డీ.ఫారం భూములను రెగ్యులర్ (ఇరవై సంవత్సరాల క్రితం ఎవరికైతే ఇచ్చారో...వారి చేతుల్లో ఉన్నవాటిని మాత్రమే) చేయడానికి ప్రభుత్వం ముందుకురావడంతో అప్పుడు భూములు కొనుగోలు చేసిన వ్యక్తులు అధికార పార్టీ నేతలను ఆశ్ర యించారు. పొరుగు జిల్లాలో కీలక నేత ఒకరు రంగంలోకి దిగి మూడు గ్రామాల్లో భూముల రెగ్యులర్‌కు చక్రం తిప్పినట్టు ఆరోపణలు వస్తున్నాయి. ఆనందపురంలో గతంలో పనిచేసిన ఇద్దరు తహసీల్దార్లపై ఒత్తిడి తీసుకువచ్చి రామవరం, భీమన్నదొరపాలెం, కోలవానిపాలెంలో సుమారు 60 ఎకరాలను రెగ్యులరైజ్ చేసేందుకు రంగం సిద్ధం చేశారని ప్రచారం సాగుతుంది. డిపట్టాదారులకు ఇచ్చిన భూములు చేతులు మారినట్టు తేలడంతో కేటాయింపులు రద్దు చేశారు. అవి ప్రస్తుతం ప్రభుత్వ ఆధీనంలో ఉన్నాయి. కానీ డి.పట్టాదారుల చేతిలో ఉన్నట్టు రికార్డులను ట్యాంపరింగ్ చేసినట్టు తెలిసింది. ప్రస్తుత మార్కెట్ ధర ప్రకారం ఈ భూముల విలువ సుమారు రూ.150 కోట్ల మేర ఉంటుంది.

భీమన్నదొరపాలెంలో 12 సర్వేనంబర్లు, రామవరం, కోల వానిపాలెంలో చెరో 11 సర్వే నంబర్లలో డి.ఫారం భూములు చేతులు మారినట్టు గుర్తించారు. వీటిలో చాలా వరకు భూములు ప్రస్తుతం ప్రభుత్వ గయాలు (బంజరు)గా ఆన్ లైన్‌లో కనిపిస్తున్నాయి. అయితే అడ్డగోలుగా వ్యవ హరించే కొందరు అధికారుల దన్నుతో రికార్డులు ట్యాంపరింగ్ చేసి అప్పట్లో డి.ఫారం పొందిన వారి పేర్లు నమోదు చేయించాలని పొరుగు జిల్లా వైసీపీ నేత ఉత్తరాంధ్రలో పార్టీని పర్యవేక్షించే కీలక నేత ద్వారా రెండు, మూడు నెలల నుంచి విశ్వప్రయత్నం చేస్తున్నారు.

నేటి నుంచి ఐపీఎల్ మ్యాచ్‌ల టికెట్ల అమ్మకం

... 5వ పేజీ తరువాయి

చేపట్టనున్నట్టు ఢిల్లీ క్యాపిటల్స్ యాజమాన్యం తెలిపింది. ఈనెల 31న ఢిల్లీ క్యాపిటల్స్-చెన్నై సూపర్‌కింగ్స్ జట్ల మధ్య జరిగే మ్యాచ్‌కు టికెట్ల అమ్మకాలు ఈనెల 27 నుంచి జరుగుతాయని పేర్కొంది. టికెట్ల ధరలను రూ.1,000, రూ.1500, రూ.2000, రూ.3,000, రూ.3,500, రూ.5,000, రూ.7,500గా నిర్ణయించింది. కాగా, ఆన్‌లైన్ టికెట్లను మామూలు టికెట్లుగా మార్చుకునేందుకు నగరంలోని స్వర్ణభారతి ఇండోర్ స్టేడియం, ఏసీఏ-వీడీసీఏ 'బి' గ్రౌండ్‌లో కేంద్రాలను ఏర్పాటుచేస్తున్నారు. ఢిల్లీ క్యాపిటల్స్-కోల్‌కతా నైట్‌రైడర్స్ మధ్య జరిగే మ్యాచ్ టికెట్లు కొనుగోలు చేసినవారు ఈనెల 26 నుంచి, ఢిల్లీ క్యాపిటల్స్-చెన్నై సూపర్‌కింగ్స్ మ్యాచ్‌కు ఆన్‌లైన్ టికెట్ పొందిన వారు ఈనెల 27 నుంచి ఆయా కేంద్రాల్లో మార్చుకోవాలని స్పష్టం చేశారు. కాగా టికెట్ల ధరలు క్రీడాభిమానులలో నిరుత్సాహాన్ని కలిగిస్తున్నాయి. ప్రారంభ టికెట్ ధర రూ.1000 కావడంతో ఆలోచనలో పడుతున్నారు.

స్కానర్ ఉన్నా... ప్రయోజనం సున్నా!

... 5వ పేజీ తరువాయి

వివరాలు ఏమీ దీని ద్వారా తెలియవు. ఇప్పుడు బ్రెజిల్ నుంచి వచ్చిన డ్రై ఈస్ట్ కంటెయినర్‌నే దీంతో స్కానింగ్ చేయిస్తే...అందులో వేయి బ్యాగులు, వాటిలో గ్రాన్యువల్స్ రూపంలో ఉన్న డ్రై ఈస్ట్ ఎక్స్‌రే ఫిల్మ్‌లా కనిపిస్తుంది. అంతే తప్ప అందులో డ్రగ్స్ కలిసి ఉన్నట్టు పసిగట్టలేదు. బంగారం, ఎర్రచందనం వంటివి కూడా ఈ స్కానర్ గుర్తించలేదు. లోపల ఉన్నది లోహం అని, దాని రూపు ఎలా ఉందనేది చెప్పగలుగుతుందే తప్ప అది బంగారమా, ఇత్తడా? అనేది వెల్లడించలేదు. అలాగే ఎర్రచందనమా, టేకు దుంగలా, సాధారణ వేపదుంగలా అనేది కూడా తెలియదు. కంటెయినర్‌లో ఉన్న సరకు ద్రవపదార్థమా, ఘన పదార్థమా? సెమీ ఘన పదార్థమా (ముద్ద)? అనేది మాత్రమేగుర్తించగలుగుతుంది. మొబైల్ ఎక్స్‌రే స్కానర్‌తో తనిఖీలు చేసి అక్రమ రవాణా నిరోధిస్తున్నామని చెప్పడం అవాస్తవాలను ప్రచారం చేయడం కిందకే వస్తుంది.కంటెయినర్లలో నిషేధ వస్తువులు రాకుండా ఉండాలంటే ఇంకాపటిష్టమైన వ్యవస్థఅవసరం.కస్టమ్స్ అధికారుల ప్రత్యక్ష తనిఖీలు పెంచడం,వారికి అవసరమైన సిబ్బందిని,వసతులు సమకూర్చడం కేంద్ర ప్రభుత్వ బాధ్యత.

నేత్రపర్వంగా అప్పన్న కల్యాణం



కల్యాణోత్సవంలో స్వామివారు

సింహాచలం, మార్చి 23: వరాహలక్ష్మీనృసింహస్వామివారి ఆర్జిత నిత్యకల్యాణోత్సవం నేత్రపర్వంగా సాగింది. శనివారం వేకువజామున సుప్రభాత సేవతో మేల్కొలిపి ప్రభాతా రాధనలు యథావిధిగా పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేసి ప్రత్యక్షంగా పాల్గొన్న ఉభయదాతల గోత్రనామాలతో సంకల్పించారు. విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనాలతో షోడశోపచారాలు సమర్పించారు. ఆగమ శాస్త్రోక్తంగా కంకణధారణ, నూతన యజ్ఞోపవీత సమర్పణ, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణలు కావించి అక్షితారోపణం జరిపారు. మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

'రాష్ట్రాన్ని డ్రగ్స్ కేంద్రంగా మార్చేశారు'

ఎంవీపీ కాలనీ, మార్చి 23: వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని డ్రగ్స్ కేంద్రంగా మార్చిందని టీఎస్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రణవ్ గోపాల్ ఒక ప్రకటనలో విమర్శించారు. జనాలను మత్తుకు బానిసలుగా చేసి, ఓట్లు దండుకోవాలని చూస్తున్నారన్నారు. రాష్ట్రంలో అన్ని కళాశాలల్లో డ్రగ్స్ యథేచ్ఛగా సరఫరా అవుతున్నాయని ఆరోపించారు. గంజాయి అక్రమ రవాణాలో నంబర్ ఒన్ స్థానానికి తీసుకువచ్చారన్నారు. యువత వైసీపీ ఉచ్చులో పడకుండా ఓటు ద్వారా తమ భవిష్యత్తును బంగారు మయం చేసుకోవాలని కోరారు.

శ్రీకృష్ణ, బలరాములకు పూజలు

ఎంవీపీ కాలనీ, మార్చి 23: శ్రీకృష్ణ చైతన్య మహాప్రభువు ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆళ్వార్‌దాస్ మైదానంలో హరే కృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో శనివారం నితాయి గౌరాంగ (శ్రీకృష్ణ బలరాములు) విగ్రహాలకు పూజలు నిర్వహించారు. ద్వాపర యుగంలోని శ్రీకృష్ణుడే కలియుగంలో శ్రీ కృష్ణ చైతన్య మహా ప్రభువుగా అవతరించారని యదురాజ దాస తెలిపారు. ఈ సందర్భంగా కృష్ణ బలరాముల విగ్రహాలకు అభిషేకం, హోళికా దహనం, హోలీ ఉత్సవం చేశారు. ఏయూ విద్యార్థులు ప్రదర్శించిన లఘు నాటిక అలరించింది.

దూరవిద్య నాణ్యతలో రాజీ లేదు : వీసీ

వెంకోజీపాలెం, మార్చి 23: ఆంధ్ర విశ్వవిద్యాలయం అందించే దూరవిద్య కోర్సులు, నిర్వహణలో రాజీ పడకుండా విద్యార్థుల సంఖ్యను పెంచాలని వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి అన్నారు. ప్లాటినం జూబ్లీ సమావేశ మందిరంలో స్కూల్ ఆఫ్ డిస్టెన్స్ అండ్ ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో శనివారం దూరవిద్యలో సంస్కరణలుపై నిర్వహించిన ఒకరోజు వర్క్‌షాప్‌ను ప్రారంభించారు. దూరవిద్య కేంద్రం స్టడీ సెంటర్ల నిర్వాహకులు, కళాశాలల ప్రిన్సిపాల్స్ కరస్పాండెంట్స్ పాల్గొన్నారు.

ట్రాన్స్‌జెండర్స్ గుర్తింపుపై సదస్సు

వెంకోజీపాలెం, మార్చి 23: ఏయూ హ్యూమెన్ జెనిటిక్స్ విభాగం ఆధ్వర్యంలో శనివారం 'ట్రాన్స్‌జెండర్స్ గుర్తింపు' అంశంపై ఒకరోజు అంతర్జాతీయ సదస్సు జరిగింది. వీసీ ప్రసాదరెడ్డి ట్రాన్స్‌జెండర్లలో హార్మోనుల చికిత్స ద్వారా మెరుగైన జీవన ప్రమాణాలపై విశ్లేషించారు. అనంతరం ఆచార్యులు పలు అంశాలపై ప్రసంగించారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

సింహాచలం, మార్చి 23: గోశాల కూడలిలో శనివారం ఏర్పాటుచేసిన ఉచిత వైద్యశిబిరాన్ని వాకర్స్ క్లబ్ 101 గవర్నర్ టి.రంగారావు ప్రారంభించారు. బెహరా హాస్పిటల్స్ వైద్యులు 300 మందికి మధుమేహ, రక్తపోటు, తదితర సమస్యలకు పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌వీఎల్ఎన్ వాకర్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు జి.సూర్యనారాయణ, అధ్యక్షులు గొర్లె నాగార్జున, కార్యదర్శి ఎం.సత్యనారాయణ, కోశాధికారి రామారావు పాల్గొన్నారు.

వంద పడకల ఆస్పత్రి కలేనా?

- స్థాయి పెంపుపై నాయకుల హామీలు
- ఏళ్లు గడుస్తున్నా లభించని మోక్షం
- పేదలకు అందని మెరుగైన వైద్యం



మధురవాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం



పీహెచ్‌సీ ప్రాంగణంలోనే ఆయుర్వేద వైద్యశాల

మధురవాడ, మార్చి 23: పాలకులు..ప్రభుత్వాలు మారుతున్నా మధురవాడ ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం అప్‌గ్రేడ్ కావడం లేదు.. ప్రతి ఎన్నికల్లో నాయకులు ఈ పీహెచ్‌సీని వంద పడకల ఆస్పత్రి స్థాయికి పెంచుతామని హామీలు ఇస్తున్నా అమలు కావడం లేదని స్థానికులు పెదవి విరుస్తున్నారు. సుమారు 30 ఏళ్ల కిందట అప్పటి జనాభా మేరకు మధురవాడలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. జనాభా ఎన్నో రెట్లు పెరిగినా ఇప్పటికీ ఆస్పత్రి స్థాయిని పెంచలేదు. అప్పట్లో కేవలం పదివేల మంది జనాభా ఉండేవారు. వారి అవసరాలకు పీహెచ్‌సీ సరిపోయేది. ప్రస్తుతం సుమారు 1.5 లక్షల జనాభాకు కూడా ఈ కేంద్రమే దిక్కవుతోంది. పీహెచ్‌సీ ఆవరణలోనే ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల, నేషనల్ హెల్త్ మిషన్ కొనసాగుతున్నాయి. జనాభా పెరుగుదలకు అనుగుణంగా స్థాయి పెంచుతామని ప్రతి ఎన్నికల సమయంలో నాయకులు హామీలు గుప్పిస్తూనే ఉన్నారు. అయితే అవేవీ అమలుకు నచుకోవడం లేదు. పీహెచ్‌సీ స్థాయి పెరిగితే పలు విభాగాలకు ప్రత్యేయ వైద్య నిపుణులు అందుబాటులోకి రావడమే కాకుండా 24 గంటలు వైద్యసేవలు అందుతాయి. మధురవాడ పరిసరాలు జాతీయరహదారి సమీపంలో ఉండడంతో రోడ్డు ప్రమాదాలు సంభవించినపుడు క్షతగాత్రులను సత్వర అత్యవసర వైద్యసేవల కోసం నగరంలోని ఆస్పత్రులకు తరలించాల్సి వస్తోంది. ఈ స్థితిలో కొందరు మధ్యలోనే ప్రాణాలు కోల్పోతున్నారు. పీహెచ్‌సీ అప్‌గ్రేడ్ అయితే ట్రామాకేర్ యూనిట్‌తో పాటు అత్యాధునిక వైద్యసేవలు అందుబాటులోకి వస్తాయి. రెండు దశాబ్దాలుగా ఆచరణకు నోచుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం ఈ ఎన్నికల తరువాత అయినా పీహెచ్‌సీ అప్‌గ్రేడ్ చేసేలా నాయకులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



బాందేవుపురంలో కరపత్రాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి



ఎమ్మెల్యే ముత్తంశెట్టికి స్వాగతం పలుకుతున్న బాందేవుపురం గ్రామస్థులు

వైసీపీతోనే రాష్ట్రాభివృద్ధి: ఎమ్మెల్యే ముత్తంశెట్టి

పద్మనాభం(రూరల్), మార్చి 23: వైసీపీతోనే రాష్ట్రాభివృ సాధ్యమని, ఎమ్మెల్యేగా మరో అవకాశం ఇవ్వాలని భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు కోరారు. మండలంలోని బాందేవుపురం, విలాస్‌ఖాన్ పాలెం గ్రామాల్లో ఆయన శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బాందేవుపురంలో మహిళలు ముత్తంశెట్టికి హారతులతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. ఎన్నికల్లో తనకు మద్దతు ఇవ్వాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ, కె.రాంబాబు. జెడ్పీ వైస్‌చైర్మన్ సుంకరి గిరిబాబు, వైసీపీ మండల పార్టీ అధ్యక్షుడు కె.లక్ష్మణరావు, సర్పంచులు ఆదిలక్ష్మి, నల్లి సత్యవతి, ఏఎంసీ మాజీ వైస్‌చైర్మన్ జి.పెద ఎర్రినాయుడు, వైసీపీ నాయకులు బోని సన్యాసినాయుడు, సన్యాసప్పడు, సత్యనారాయణ, ఎంపీటీసీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలి



విద్యార్థినికి ప్రశంసాపత్రం అందిస్తున్న దృశ్యం

కొమ్మాది, మార్చి 23: విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని నూతన ఆవిష్కరణలకు నాంది పలకాలని చెన్నై మారిటైమ్ యానివర్సిటీ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మాజీ మెంబర్ కె.రవికిరణ్ అన్నారు. శనివారం గాయత్రి విద్యాపరిషత్ మహిళా ఇంజనీరింగ్ కళాశాల వార్షికోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యావ్యవస్థలో వస్తున్న మార్పులు, విద్యార్థినులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. గాయత్రి విద్యాపరిషత్ కార్యదర్శి ఆచార్య పి.సోమరాజు మాట్లాడుతూ విద్యార్థినులు ఇంజనీరింగ్ విద్యలో మారుతున్న సాంకేతిక అంశాలను గుర్తిస్తూ విజయపథంలో నడవాలని ఆకాంక్షించారు. ప్రతిభ చూపిన విద్యార్థినులు, అధ్యాపకులకు ప్రశంసాపత్రాలు అందచేశారు. అనంతరం సాంస్కృతిక కార్య క్రమాలతో అలరించారు. కార్యక్రమంలో కళాశాల కమిటీ సభ్యులు ప్రసాద్, రాజగణపతి, కామేశ్వరరావు, ప్రిన్సిపాల్ ఆర్.కె.గోస్వామి, వైస్ ప్రిన్సిపాల్ సుధీర్ అధ్యాపకులు పాల్గొన్నారు.

గడప గడపకు వైసీపీ స్టిక్కర్లు కనిపించలేదా?



సింహాద్రిపురంలో వైసీపీ స్టిక్కర్లు

వెంకోజీపాలెం, మార్చి 23: ఎన్నికల నియమావళి అమలులోకి వచ్చి వారం గడుస్తున్నా అధికారులు ఇంటింటికీ అతికించిన వైసీపీ స్టిక్కర్లు మాత్రం తొలగించలేదు. 15వ వార్డులోని సింహాద్రిపురం కొండవాలు ప్రాంతం ప్రధాన రహదారిలోని ఇళ్లకు గతంలో గడప గడపకు ప్రభుత్వంలో భాగంగా ఇంటింటికి అతికించిన స్టిక్కర్లను వదిలేశారు. నిబంధనల మేరకు చర్యలు తీసుకోకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు కావాలనే వదిలేశారంటూ విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

వైసీపీ కార్యాలయ ప్రారంభోత్సవం అడ్డుకున్న పోలీసులు

సింహాచలం, మార్చి 23: జీవీఎంసీ 98వ వార్డులో వైసీపీ ఎన్నికల కార్యాలయ ప్రారంభోత్సవాన్ని గోపాలపట్నం పోలీసులు అడ్డుకున్నారు. పోస్టాఫీసు వీధిలోని ప్రైవేటు కల్యాణ మండపంలో ఏర్పాటు చేయనున్న కార్యాలయాన్ని భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు శనివారం ప్రారంభించాల్సి ఉంది. అయితే కార్యాలయ ఏర్పాటుకు అనుమతి లేదని పోలీసులు వారించడంతో కార్యక్రమం నిలిపివేశారు. పార్టీ శ్రేణులతో ఆత్మీయ సమావేశం నిర్వహించి, ఎమ్మెల్యే వెనుదిరిగారు.

పాలిటెక్నిక్ డిప్లమోతో ఉజ్వల భవిష్యత్తు : జెడ్సీ



మెరిట్ సర్టిఫికెట్లను అందిస్తున్న జడ్సీ కనకమహాలక్ష్మి

భీమునిపట్నం, మార్చి 23: పాలిటెక్నిక్ డిప్లొమోతో యువతులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని జీవీఎంసీ భీమిలి జోనల్ కమిషనరు కె.కనకమహాలక్ష్మి అన్నారు. శనివారం పట్టణంలోని నేరెళ్లవలసలో జరిగిన ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల వార్షికోత్సవంలో ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆమె మాట్లాడారు. పాలిటెక్నిక్ పూర్తిచేసివారికి ఉద్యోగావకాశాలుంటాయన్నారు. ఈ సెట్ ద్వారా బీటెక్ ఇంజనీరింగ్ చేస్తే ఉన్నతంగా రాణించవచ్చునన్నారు. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ సిహెచ్.మురళీకృష్ణ కళాశాల వార్షిక ప్రగతిని వినిపించారు. అనంతరం, విద్యార్థినులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో డీసీసీపీ, డీసీఈ, డీఈసీఈ, డీఈ విభాగాల హెచ్‌వోడీలు, లెక్చరర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా, విద్యార్థినులకు మెరిట్ సర్టిఫికెట్లను జడ్సీ అందించారు.

దేశ భవితకు విద్యార్థులు బాటలు వేయాలి



శ్రీనివాసరావుకు జ్ఞాపిక అందిస్తున్న సోమరాజు

సాగర్‌నగర్, మార్చి 23: ప్రతీ విద్యార్థి దేశం భవితకు బాటలు వేసేలా ఎదగాలని ఎన్ఎస్‌టీఎల్ డీఎస్ అండ్ డీజీ ఎన్ఎస్ఎమ్ (రక్షణ మంత్రిత్వశాఖ అధికారి) డాక్టర్ వై.శ్రీనివాసరావు అన్నారు. శనివారం రుషికొండ గాయత్రీ విద్యాపరిషత్ క్యాంపస్ ఓపెన్ ఆడిటోరియంలో జరిగిన ద్వారకానగర్, ఎంవీపీ కాలనీ జీవీపీ డిగ్రీ, పీజీ కళాశాలల వార్షికోత్సవాన్ని ఆయన ముఖ్యఅతిథిగా జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించినప్పుడు మంచిఫలితాలను అందుకుంటారన్నారు. కొత్తఆలోచనలతో ఉన్నతస్థానాలకు ఎదగాలన్నారు. జీవీపీ సెక్రటరీ, కరస్పాండెంట్ ఆచార్య పి.సోమరాజు అధ్యక్షోపన్యాసం చేశారు. ప్రిన్సిపాల్ ఆచార్య రజని విలువలతో కూడిన విద్యను అందిస్తున్నామన్నారు. విద్యా సంస్థ ప్రెసిడెంట్ ఆచార్య పి.వి.శర్మ విద్యార్థులు మంచినడవడిక అలవరచుకోవాలన్నారు. ఆచార్య పి.రాజగణపతి, డి.వి.యస్.కామేశ్వరరావు, ఆర్.ఎం.రావు తదితరులు పాల్గొన్నారు. విద్యార్థుల పలు సాంస్కృతిక ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు.

క్షయ వ్యాధి నివారణ సాధ్యమే..



మధురవాడలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

మధురవాడ, మార్చి 23: క్షయ వ్యాధికి ఆరునెలలపాటు క్రమం తప్పకుండా మందులు వాడితే నయమవుతుందని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రశాంతి తెలిపారు. ప్రపంచ క్షయవ్యాధి నివారణ దినంలో భాగంగా శనివారం వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా ప్రశాంతి మాట్లాడుతూ క్షయకు కారణమైన మైక్రోబాక్టీరియాను శాస్త్రవేత్త రాబర్ట్ కోచ్ 1882లో కనుగొన్న తరువాత దశల వ్యాధి నియంత్రణకు మందులు వచ్చాయన్నారు.

తూడెంలో జలదినోత్సవ ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

భీమునిపట్నం (రూరల్) మార్చి 23: ప్రపంచ జలదినోత్సవం సందర్భంగా శనివారం తూడెం ఉన్నత పాఠశాలలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. దివీస్ మేనేజరు వైఎస్ కోటేశ్వరరావు మాట్లాడుతూ నీటిని పొదుపుగా వాడుకోవాలన్నారు. డి.సురేశ్, ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అష్టలక్ష్మికి ఘనంగా సామూహిక కుంకుమార్చన



సామూహిక కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

భీమునిపట్నం, మార్చి 23: స్థానిక కృష్ణాకాలనీ వెంకటగిరిపైనున్న శ్రీ పద్మావతి, గోదా సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ద్వాదశ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదో రోజు శనివారం పలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున స్వామివారికి సుప్రభాత సేవ, ప్రభాత ఆరాధనలు జరిగాయి. ఉదయం 9 గంటలనుంచి నిత్య విశేష హోమాలు, సామూహిక అష్టలక్ష్మి కుంకుమార్చనలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులు స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు. సాయంత్రం నిత్యారాధనలు, హోమాల అనంతరం, పండిత సదస్యం, తులాభారం జరిగింది. ఈ సందర్భంగా శ్రీకృష్ణ కూచిపూడి నృత్య నిలయం కళాకారుల ప్రదర్శన ఆకట్టుకుంది. నృత్య కళాకారిణి, మాస్టర్ కృష్ణవేణి ఈశ్వర్ ఈసందర్భంగా ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమాలు ఆలయ సంక్షేమ సంఘం అధ్యక్షులు గాడు అప్పలనాయుడు, గౌరవాధ్యక్షులు ఆదిమూలం నాగరాజు, ప్రధాన కార్యదర్శి ధనాల కోటి చందు, కోశాధికారి ముమ్మిడిశెట్టి సత్యానందరావు, కార్పొరేటర్ గాడు చిన్నికుమారి లక్ష్మి, గొట్టిముక్కల సత్యకుమార్ వర్మ, లావణ్య, అప్పలనరసయ్య, ముత్యాలరావు, హరి, ఆనంద్, సన్నిబాబు, అప్పన్న, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

భారతీయ సంస్కృతికి వేదాలు మూలం



సదస్యంలో పాల్గొన్న వేద పండితులు

సింహాచలం, మార్చి 23: భారతీయ సనాతన సంస్కృతికి మూలం వేదాలని సింహాచల వరాహలక్ష్మీనృసింహస్వామి ఆలయ స్థానాచార్యులు డా.టీపీ రాజగోపాల్ అన్నారు. సీతారామస్వామి వార్షిక తిరుకల్యాణోత్సవాలలో భాగంగా శనివారం వేదపండిత సదస్యం జరిగింది. వేద వాఙ్మయంలో అనేక శాస్త్ర విషయాలు మానవాళికి అనుసరణీయాలున్నాయన్నారు. పండితులు పద్మహాస చక్రవర్తి లక్ష్మణ, హనుమత్ సమేత సీతారామస్వాములకు సుప్రభాతసేవ, ప్రభాతారాధనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. సదస్యం అంతర్భాగంగా దేవస్థాన ఆస్థాన పండితులు చతుర్వేదాలలోని పన్నాలను, నాలాయిర దివ్యప్రబంధం, రాగయుక్తంగా పఠించారు. అర్చకులు మంగళ నీరాజనాలిచ్చిన తరువాత పండితులను చందన, సుగంధ పరిమళాలతో సత్కరించారు. వేదపండిత సదస్యానికి స్థానాచార్యులు డా.టీపీ రాజగోపాల్ అధ్యక్షత వహించగా, పండితులు ముక్కామల సుబ్రహ్మణ్య శర్మ, రామాయణం జగన్మోహన్‌శర్మ, మొగ్గవరపు లలిత్‌కుమార్ శర్మ, మధుర సోమయాజుల శర్మ, కోట అనుష్‌కుమార్ శర్మ, సరిపల్లి కిరణ్‌కుమార్ శర్మ, కొలచిన కుమార్ శర్మ పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయం పరిశీలించిన ఆర్డీవో

ఆరిలోవ, మార్చి 23: చినగదిలి తహసీల్దార్ కార్యాలయాన్ని భీమిలి ఆర్డీవో ఎస్.భాస్కరరెడ్డి శనివారం సందర్శించారు. అభివృద్ధి పనులపై తహసీల్దార్‌తో చర్చించారు. రానున్న ఎన్నికల నేపథ్యంలో తీసుకోవాల్సిన చర్యలపై సూచనలిచ్చారు. డిప్యూటీ కలెక్టర్ కృష్ణమూర్తి పాల్గొన్నారు.

మురుగునీటితో అప్పన్న భక్తులకు అవస్థలు



రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీరు

సింహాచలం, మార్చి 23: వరాహలక్ష్మీనృసింహస్వామి దర్శనానికి వచ్చే భక్తులు మురుగునీరు దాటి ప్రయాణించాల్సి వస్తోంది. ఇటీవల బీఆర్‌టీఎస్ సింహాచలం కారిడార్ నిర్మాణ పనుల్లో భాగం గా పాత మురుగునీటి వ్యవస్థ పూర్తిగా దెబ్బతింది. దాంతో సింహగిరి ఘాట్‌రోడ్డు, కాపువీధి, పాతఅడివివరం ప్రాంతాల్లో స్థానికుల వాడుకనీరు ప్రధాన రోడ్లపై ప్రవహిస్తోంది. తక్షణం సమస్య పరిష్కరించాలని భక్తులు కోరుతున్నారు.

కాలానుగుణంగా మారుతున్న మార్కెటింగ్ విధానాలు



ఆచార్య కిశోర్‌బాబును సత్కరిస్తున్న ఏయూ అధికారులు

వెంకోజీపాలెం, మార్చి 23: కాలానుగుణంగా మార్కెటింగ్ విధి విధానాలు మారుతున్నాయని కేఎల్ బిజినెస్ స్కూల్ ప్రొఫెసర్ మారివన కిశోర్‌బాబు అన్నారు. ఏయూ డిపార్టుమెంట్ ఆఫ్ కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన మార్కెటింగ్ డైమన్షన్స్ ఇన్ ఇండస్ట్రీ కార్యక్రమంలో ఆయన అతిథి ఉపన్యాసమిచ్చారు. కార్పొరేట్ రంగంలో పోటీతత్వం పెరుగుతోందని, ఫోకస్డ్ టార్గెట్ గ్రూప్స్ ను చేరుకోగలిగితే వస్తు విక్రయాలు పెరిగి లాభాలు వస్తాయన్నారు. ఉత్పత్తుల సమాచారాన్ని వినియగదారులకు తెలియపరిచే సాధనంగా ప్రకటనలను ఆశ్రయిస్తారన్నారు. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ టెక్నాలజీని అందిపుచ్చుకున్నప్పుడే పోటీలో నిలబడతామని ఒకప్పుడు ధనలక్ష్మి, అష్టలక్ష్మి, సరస్వతి, లక్ష్మి, ధైర్యలక్ష్మి, ధాన్యలక్ష్మి, అంటూ అనేక రూపాలలో ఉన్న లక్ష్మి ఇప్పుడు టెక్ లక్ష్మి (టెక్నాలజీ లక్ష్మి)గా మారిందని, ఈ క్రమంలో ప్రతి విద్యార్థీ టెక్నాలజీని అందిపుచ్చుకోవాలన్నారు. ఏయూ అధికారులు కిశోర్‌బాబును సత్కరించారు.

భగత్‌సింగ్ పోరాటం యువతకు ఆదర్శం



తగరపువలసలో నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

మధురవాడ, మార్చి 23: స్వాతంత్ర్య సమర యోధులు భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్ జీవితాలు యువతకు ఆదర్శం కావాలని సీఐటీయు మధురవాడ జోన్ కార్యదర్శి పి.రాజ్‌కుమార్ అన్నారు. భగత్‌సింగ్ 93వ వర్ధంతిని మధురవాడలో నిర్వహించారు. ఈసందర్భంగా సందర్భంగా ఆయన మాట్లాడుతూ భగత్‌సింగ్ మూఢనమ్మకాలు, మతతత్వాన్ని వ్యతిరేకించారన్నారు. దోపిడీ నుంచి ప్రజల విముక్తికి తుది శ్వాస వరకు పోరాడారన్నారు. కార్యక్రమంలో నాయకులు బి.నాగేశ్వరరావు, ఎర్రన్న, కె.వెంకటరావు, డి.అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

తగరపువలస: విప్లవ వీరుడు భగత్‌సింగ్ వర్ధంతిని పలుచోట్ల శనివారం నిర్వహించారు. తగరపువలస సీపీఐ కార్యాలయంలో జరిగిన కార్యక్రమానికి కానూరి రాంబాబు అధ్యక్షత వహించారు. అల్లు బాబూరావు, కొండపు ఈశ్వరరావు, రాం పైడి, వానపల్లి సత్యం, మావూరి వీర్రాజు తదితరులు భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన చేసిన విప్లవ పోరాట పంథాను వివరించారు. చిట్టివలస సీపీఐ కార్యాలయంలో జరిగిన కార్యక్రమానికి ఆర్ నరసింగరావు అధ్యక్షత వహించారు. యువజన సమాఖ్య నాయకులు ఎస్ శ్రీనివాసవర్మ, తదితరులు నివాళులర్పించారు.

సినిమా గైడ్

- **ఓం భీం బుష్ :** మెలోడి, సంగం, కామేశ్వరి, శారద, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), లిఖిత (శ్రీహరిపురం), శ్రీకన్య-2 (గాజువాక), దుర్గ (మధురవాడ), సీతారామయ్య (పరవాడ), అరుణ (పెదగంట్యాడ), తాతా (తగరపువలస)
- **భీమా :** రమాదేవి, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), శ్రీనరసింహ (గోపాలపట్నం), హెవెన్ (గాజువాక), రాములమ్మ (తగరపువలస)
- **లైన్ మ్యాన్ :** లీలామహల్, మోహిని కాంప్లెక్స్ (గాజువాక)
- **యమధీర :** మౌర్య (గోపాలపట్నం)
- **గామి :** జగదాంబ, లక్ష్మీకాంత్ (గాజువాక)
- **ప్రేమలు :** శ్రీవెంకటేశ్వర, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), లక్ష్మి (గాజువాక), నటరాజ్ (పెందుర్తి), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సప్తగిరి (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 23, టమాటా 16, వంకాయలు (తెలుపు) 22, వంకాయలు (నలుపు) 22, బెండకాయలు 24, పచ్చిమిర్చి 46, కాకరకాయలు 28, బీరకాయలు 38, ఆనపకాయ 12, కాలీఫ్లవర్ 20, క్యాబేజీ 18, క్యారెట్ 30, దొండకాయలు 22, బంగాళదుంపలు 21, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 38, అల్లం (పాతది) 144, బరబాటి 18, ముల్లంగి 16, నిమ్మకాయలు (కిలో) 90, గోరుచిక్కుడు 34, దోసకాయలు 20, వెల్లుల్లి (పెద్దవి) 144, కొబ్బరికాయ (పెద్దది) 22, బీన్స్ (పెన్సిల్) 50, ఆగాకర 52, పొటల్స్ 76, కీరదోస 24, కాప్సికమ్ 56, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 50, చిలగడదుంపలు 30, కంద 60, దేముడు చిక్కుడు 54, కొండఉసిరి 65, కరివేపాకు (కిలో) 50, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 55, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 35.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	415
విజయనగరం	419
శ్రీకాకుళం	419

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	102
ఫారం ధర	--	122
విత్ స్కిన్	--	214
స్కిన్‌లెస్	--	224

మరికొన్ని సిటీ వార్తలు పేజీ[లో..